www.prajanaava.in
Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 197 | ఆదివారం | 12 జులై, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 9014966169

నిందితుడు రాజ్‌కుమార్

కిరాతకుడు!

- పోక్సో కేసు పెట్టిందని కక్ష..
- బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను కిరాతకంగా హతమార్చిన నిందితుడు
- రంగారెడ్డి జిల్లా దైవాలగూడలో దారుణం
- సొంత భార్య, ఇద్దరు చిన్నారులనూ చంపిన దుండగుడు
- బాలికపై లైంగికదాడి అనంతరం హత్య చేసినట్లు పోలీసుల అనుమానం

2

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో శనివారం తెల్లవారుజామున రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సామూహిక హత్యలు చోటుచేసుకున్నాయి. తనపై నమోదైన పోక్సో కేసుపై కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి మొత్తం ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మృతుల్లో తనపై ఫిర్యాదు చేసిన 17 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు నిందితుడి భార్య, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేగింది.

నిందితుడి చేతిలో హత్యకు గురైన భార్య, పిల్లలు

వియత్నాంలో విషాదం

భారీ అలలతో బోల్తాపడిన స్పీడ్‌బోటు

- 15మంది భారతీయ పర్యాటకుల దుర్మరణం
- మృతుల్లో 10మంది తమిళనాడు వాసులు, ముగ్గురు ఆంధ్రప్రదేశ్, ఇద్దరు కేరళకు చెందినవారిగా గుర్తింపు
- ఫూక్వాక్ దీవి సమీపంలో ఘటన
- ప్రమాదంపై దర్యాప్తునకు వియత్నాం ప్రభుత్వం ఆదేశం
- బాధితులకు అన్నివిధాలా సహాయం: ప్రధాని మోదీ
- ప్రమాద కారణాలపై సమగ్ర విచారణకు ఆదేశాలు

ఘటన స్థలం వద్ద మునిగిపోయిన బోటు, సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది

హనోయి: వియత్నాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫూ క్వాక్ దీవి సమీపంలో శనివారం జరిగిన ఘోర బోటు ప్రమాదంలో 15మంది భారతీయ పర్యాటకులు మృతి చెందారు. భారతీయులను తీసుకెళ్తున్న స్పీడ్‌బోటు సముద్రంలో బోల్తాపడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బోటులో 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు స్థానిక సిబ్బంది కలిపి మొత్తం 36 మంది ఉండగా, 21 మందిని సహాయక బృందాలు సురక్షితంగా రక్షించాయి. ప్రమాదం ఫూ క్వాక్ తీరానికి సమీపంలోని హోన్ మే రట్ న్గోయ్ దీవి వద్ద సుమారు 400 మీటర్ల దూరంలో జరిగింది. ద్వీప సందర్శన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న సమయంలో భారీ అలలు బోటును తాకడంతో అది బోల్తాపడినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని పర్యాటక బోట్లు ఘటనా స్థలానికి చేరుకుని పలువురిని రక్షించాయి. అనంతరం సరిహద్దు భద్రతా దళాలు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్, ఇతర అత్యవసర సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అయితే బోటు తలకిందులవడంతో కొందరు ప్రయాణికులు లోపలే చిక్కుకుపోవడం వల్ల సహాయక చర్యలు క్లిష్టంగా మారినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

మృతుల్లో ముగ్గురు తెలుగువారు

మృతిచెందిన 15 మందిలో తమిళనాడుకు చెందిన వారు 10 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ముగ్గురు, కేరళకు చెందిన వారు ఇద్దరు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవితేజ, శ్రీధర్ ముడియం, జయలక్ష్మి గెల్లి మృతిచెందిన వారిలో ఉన్నారు. మృతదేహాలన్నింటినీ వెలికితీసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బాధితుల కుటుంబాలకు సహాయంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ ప్రభుత్వాలు హెల్ప్‌లైన్ నంబర్లను విడుదల చేశాయి.

భారీ అల తాకింది

ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, భారీ అల ఒక్కసారిగా బోటును ఢీకొట్టిందని తరువాయి 2లో..

మౌనమైన మధుర స్వరం!

2,8

గాన కోకిల ఎస్. జానకి ఇకలేరు

- మైసూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి
- నాలుగు భాషల్లో 48వేలకు పైగా పాటలు పాడిన లెజెండరీ గాయని

మధుర గానంతో ఐదు దశాబ్దాలకు పైగా కోట్లాది సంగీతాభిమానుల హృదయాలను అలరించిన భారత గాన కోకిల, పద్మభూషణ్ ఎస్. జానకి ఇక లేరు. వేలాది చిత్రగీతాలు, భక్తిగీతాలు, జానపద గీతాలతో సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర వేశారామె. నిశ్శబ్దమైనా, భావోద్వేగాలకు ప్రాణం పోసిన ఆ స్వరం తరతరాల సంగీత ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటుంది. భారతీయ సినీ సంగీత చరిత్రలో ఒక స్వర్ణయుగానికి ప్రతీకగా నిలిచిన జానకి మరణం సంగీత లోకానికి తీరని లోటును మిగిల్చింది.

కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

2

- మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలు
- మూస్తేనే నీటి ఎత్తిపోతలకు అవకాశం.. అలాచేస్తే బ్యారేజీకే ప్రమాదం
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటల వ్యాఖ్యలు: సీఎం రేవంత్ రెడ్డి

సవాళ్ల మధ్య అభివృద్ధి

ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారత్

- యూపీఐ, డ్రోన్లు, అంతరిక్ష రంగాల్లో కొత్త శిఖరాలు
- భారత్–న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో రెండు దేశాలకు కొత్త అవకాశాలు
- ప్రవాసులు రెండు దేశాల మధ్య వారధిగా నిలవాలి
- కియా ఓరా మోదీ కార్యక్రమంలో ప్రధాని మోదీ

ఆక్లాండ్: ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ అభివృద్ధి వేగం అపూర్వంగా కొనసాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారత్‌దేనని స్పష్టం చేశారు. భారత్ ప్రపంచానికి కొత్త అభివృద్ధి నమూనాలను అందిస్తోందని చెప్పారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో శనివారం నిర్వహించిన కియా ఓరా మోదీ భారతీయ ప్రవాసుల మహాసభలో మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కూడా పాల్గొన్నారు. సుమారు 10వేల మందికి పైగా భారతీయులు సభకు హాజరయ్యారు. భారత్‌లో ప్రతి నెల కోట్లాది డిజిటల్ లావాదేవీలు యూపీఐ ద్వారా జరుగుతున్నాయని, డ్రోన్ సాంకేతికత, అంతరిక్ష ఆర్థిక వ్యవస్థల్లో దేశం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని మోదీ తెలిపారు. భారత్ అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక ప్రగతికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. భారత్–న్యూజిలాండ్ భవిష్యత్తు పరస్పరం అనుసంధానమై ఉందని పేర్కొన్న మోదీ, రెండు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనకు మరింత ఊతమిస్తుందని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల వ్యాపార వర్గాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ముఖ్యంగా అంతరిక్ష రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు.

వాకా ప్రతీక

న్యూజిలాండ్ సంస్కృతిలోని వాకా అనే భావనను ప్రస్తావించిన మోదీ, అది ప్రజలను ఒకే ప్రయాణంలో కలిపే ప్రతీక అని చెప్పారు. భారత్–న్యూజిలాండ్ సంబంధాలు కూడా ఇప్పుడు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. రెండు దేశాల ముందు తరువాయి 2లో..

2

హర్మ్యూజ్ జలసంధిపై ఉత్కంఠ

- ట్రంప్–ఇరాన్ పరస్పర హెచ్చరికలు
- జలసంధి భద్రతపై ఇరాన్–ఒమాన్ విదేశాంగ మంత్రుల కీలక భేటీ
- చర్చలు కొనసాగుతాయని ఇరు దేశాల నిర్ణయం
- మరోవైపు ట్రంప్, కొత్త సుప్రీం నేత ఖమేనీ మధ్య మాటల యుద్ధం

నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

- ట్రంప్ హెచ్చరికలు

6

ప్రతీకారం తీర్చుకుంటాం

- ఇది ఇరాన్ ప్రజల డిమాండ్
- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా

కిరాతకుడు!

పోక్సో కేసు పెట్టిందని కక్ష

- రంగారెడ్డి జిల్లా దైవాలగూడలో దారుణం
- బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను కిరాతకంగా హతమార్చిన నిందితుడు
- సొంత భార్య, ఇద్దరు చిన్నారులనూ చంపిన దుండగుడు

ప్రజానావ, రంగారెడ్డి బ్యూరో (దీక్షిత్): రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో శనివారం తెల్లవారుజామున రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సామూహిక హత్యలు చోటుచేసుకున్నాయి. తనపై నమోదైన పోక్సో కేసుపై కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి మొత్తం ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మృతుల్లో తనపై ఫిర్యాదు చేసిన 17 ఏళ్ల బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు నిందితుడి భార్య, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌పై ఓ బాలికను వేధించాడంటూ ఈ ఏడాది మే 16న బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మే 26న అతడిని అరెస్టు చేశారు. అనంతరం శుక్రవారం బెయిల్‌పై విడుదలైన రాజ్‌కుమార్ గ్రామానికి చేరుకున్నాడు. శనివారం తెల్లవారుజామున తొలుత తన ఇంట్లోనే భార్య సరిత (30), మూడేళ్ల కుమార్తె పరీక్షిత్, రెండేళ్ల కుమారుడు రుద్రవాన్ష్‌ను కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి బాలిక తల్లి చిట్యాల లక్ష్మి, నానమ్మ చిట్యాల రుక్కమ్మ (65)లను అదే ఆయుధంతో హత్య చేశాడు. ఆ తర్వాత బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లి గ్రామ శివారులో లైంగికదాడికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఫోరెన్సిక్ నివేదికల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంది. హత్యల అనంతరం రాజ్‌కుమార్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పినట్లు సమాచారం. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించగా, షాబాద్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

సీసీటీవీలో దృశ్యాలు

ప్రాథమిక విచారణలో పోక్సో కేసుపై కక్షే ఈ సామూహిక హత్యలకు కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాలికను నిందితుడు తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు వెల్లడించారు. హత్యలకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న రాజ్‌కుమార్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నగర పోలీసు కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో చోటుచేసుకున్న అత్యంత దారుణమైన సామూహిక హత్యల ఘటనల్లో ఇది ఒకటిగా పోలీసులు పేర్కొన్నారు.

గ్రామంలో విషాదఛాయలు

ఒకేరోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో దైవాలగూడ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదే సమయంలో నింది తుడి విషయంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ ఘటనను నివారించవచ్చని గ్రామస్థులు ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

షాబాద్ హత్యల ఘటన అత్యంత దారుణం

నిందితుడికి బెయిల్ రాకుండా ఎందుకు అడ్డుకోలేదు: కేటీఆర్

ప్రజానావ, హైదరాబాద్ : పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీఆర్ స్పందించారు. షాబాద్‌లో జరిగిన సంఘటన అతి దారుణమైంది. అందరం దా కలత చెందే ఒక దరిద్రమైన వార్త అని టీఆర్ అన్నారు. పోక్సో లాంటి ఘటన జరిగిన తర్వాత, ఒక మైనర్ బాలిక మీద అత్యాచారం జరిగిన తర్వాత వారికి బెయిల్ ఇవ్వడం.. బెయిల్ ఇచ్చే క్రమంలో న్యాయమూర్తుల దగ్గర ప్రభుత్వం తన వాదనలను పటిష్టంగా వినిపించకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని అనుకుంటున్నానన్నారు.. షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన హత్యలేనని టీఆర్ అన్నారు. ఈ ఆరుగురి హత్యకు కచ్చితంగా హోంశాఖ వైఫల్యం, నిందితుడికి బెయిల్ వచ్చేలా నిర్లక్ష్యంగా వాదించిన న్యాయవాదుల వైఫల్యమే కారణమన్నారు. రేవంత్ రెడ్డి కచ్చితంగా సమాధానం చెప్పాలి. ఇట్లాంటి దుర్మార్గులకు బెయిల్ ఎందుకు ఇస్తున్నరు. ఏ కారణం చేత వాళ్లకు బెయిల్ ఇచ్చి ఈ మానవ మృగాలను సమాజంలోకి మీరు వదులుతున్నారు. ఎవరు బాధ్యులు..? అని కేటీఆర్ అడిగారు. ఓ ఆడపిల్ల తండ్రిగా అడుగుతున్నా.. ఎంత బాధ అవుతది.. అఘాయిత్యం జరుగడమే ఘోరమంటే.. అఘాయిత్యం జరిగిన తర్వాత పబ్లిక్‌గా వచ్చి చెప్పుకోవడమే భయంకరమైన పరిస్థితి అంటే దాని మీదికెళ్లి ఇవాళ ఆ మానవ మృగాలకు బెయిల్లు ఇచ్చి వాళ్ల పలుకుబడి, డబ్బులను ఉపయోగించుకొని అఘాయిత్యాలు చేస్తుంటే సిగ్గులేకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నోరు మూసుకుని ర్చుని.. ఏ ధైర్యంతో రేపటి రోజున ఆడపిల్లలు ఏమన్నా జరిగితే బయటకు వచ్చిఫిర్యాదు చేస్తరని ప్రశ్నించారు. తల్లిదండ్రులు భయపడరా.. ? సిగ్గుండాలి ఈ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి అని ఫైర్ అయ్యారు.

సిరిసిల్లతో గానకోకిలకు చిరస్మరణీయ అనుబంధం

- రాజన్న సిరిసిల్లలోనే బాల్యం
- సినిమాలు చూసేందుకు ఎడ్లబండిపై వేములవాడకు
- రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో గానసేవ
- సినీ గాయనిగా ఎదిగాక కూడా జిల్లాతో కొనసాగిన ఆప్యాయ బంధం

ప్రజానావ, సిరిసిల్ల: భారత గాన కోకిల ఎస్. జానకి సినీ సంగీత ప్రపంచంలో అపూర్వ శిఖరాలను అధిరోహించినప్పటికీ, ఆమె బాల్య జ్ఞాపకాలు మాత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాతో విడదీయరాని బంధంగా మిగిలిపోయాయి. దాదాపు ఆరేళ్ల పాటు సిరిసిల్లలో గడిపిన ఆమె చిన్ననాటి అనుభవాలను జీవితాంతం మధురస్మృతులుగా గుర్తుచేసుకునేవారు. సిరిసిల్ల, వేములవాడలతో తనకు ఉన్న అనుబంధాన్ని పలు సందర్భాల్లో అభిమానులతో పంచుకున్నారు. జానకి తండ్రి శ్రీరామమూర్తి సిరిసిల్లలో తెలుగు ఉపాధ్యాయుడిగా, ఆయుర్వేద వైద్యుడిగా సేవలందించారు. ఆ సమయంలో వారి కుటుంబం పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం సమీపంలో ఉన్న తిమ్మయ్యగారి బంగ్లాలో అద్దెకు నివసించింది. అక్కడ ఉన్న కాలంలో స్థానిక చేనేత కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్న జానకి, తోటి పిల్లలతో కలిసి మానేరు వాగు ఒడ్డున పాటలు పాడుతూ, ఆటలు ఆడుకుంటూ గడిపిన రోజులను ఎన్నో వేదికలపై ఆప్యాయంగా స్మరించుకున్నారు. వేములవాడతోనూ ఆమెకు ప్రత్యేక అనుబంధం ఉండేది. చిన్నతనంలో ఎడ్లబండిపై వేములవాడకు వెళ్లి సినిమాలు చూసి తిరిగి వచ్చేవారమని ఆమె పలుమార్లు పేర్కొన్నారు. అలాగే శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తిగీతాలు ఆలపించిన సందర్భాలను కూడా గుర్తుచేసుకున్నారు. సినీరంగంలో దేశవ్యాప్త ఖ్యాతి సాధించిన తర్వాత కూడా వేములవాడను సందర్శించి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

సిరిసిల్లలో ఆత్మీయ సన్మానం

2001లో సిరిసిల్లలో నిర్వహించిన 'సిరి వెలుగుల ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమానికి జానకిని ఆహ్వానించినట్లు నేషనల్ బుక్ ట్రస్టు ఎడిటర్ పత్తిపాక మోహన్ తెలిపారు. ఆ కార్యక్రమానికి హాజరుకాలేకపోయినా, అనంతరం సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా స్థానిక రచయితలు, సాహితీవేత్తలు ఆమెను ఘనంగా సన్మానించినట్లు చెప్పారు. జానకి బాల్యంలో సిరిసిల్ల ప్రాంతంలో రైతాంగ భూపోరాటాల ప్రభావం తీవ్రంగా ఉండేదని స్థానిక పెద్దలు గుర్తుచేస్తున్నారు. ఆ పరిస్థితుల నేపథ్యంలో ఆమె కుటుంబం అనంతరం చెన్నైకి వెళ్లినట్లు చెబుతున్నారు. అయితే సిరిసిల్లలో గడిపిన బాల్యానుభవాలు, వేములవాడతో ఏర్పడిన అనుబంధం ఆమె జీవితంలో ఎప్పటికీ చెరగని జ్ఞాపకాలుగా నిలిచాయి. భారత గాన కోకిలగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎస్. జానకి పేరు వినిపించిన ప్రతిసారీ, ఆమెతో ఉన్న ఈ మధుర అనుబంధాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు గర్వంగా స్మరించుకుంటున్నారు.

బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

- హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్
- దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణ
- దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ
- ఇప్పటి 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి
- వికసిత్ భారత్-2047.. సాంతికత పాత్రపై అశ్వినీ వైష్ణవ్

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్–2047.. సాంతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ వలం తెలంగాణ రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటి 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వీనీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేకేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు.ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు వలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ వలం నరేకేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్–2047' లక్ష్య సాధనలో సాంతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటి ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడిటెడ్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటి ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

హర్మ్యూజ్ జలసంధిపై ఉత్కంఠ

- ట్రంప్-ఇరాన్ పరస్పర హెచ్చరికలు
- జలసంధి భద్రతపై ఇరాన్—ఒమాన్ విదేశాంగ మంత్రుల కీలక భేటీ
- మరోవైపు ట్రంప్, కొత్త సుప్రీం నేత ఖమేనీ మధ్య మాటల యుద్ధం

దుబాయ్: యుద్ధ విరమణ కోసం కుదిరిన తాత్కాలిక ఒప్పందం మళ్లీ సంక్షోభంలో పడిన వేళ, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధి భవితవ్యంపై ఇరాన్, ఒమాన్ విదేశాంగ మంత్రులు శనివారం కీలకంగా సమావేశమయ్యారు. జలసంధిలో నౌకల సురక్షిత రాకపోకలు కొనసాగేందుకు అవసరమైన రాజకీయ, సాంకేతిక అంశాలపై చర్చలు కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. హర్మ్యూజ్ జలసంధిలో ఇటీవల నౌకలపై ఇరాన్ దాడులు, వాటికి ప్రతిగా అమెరికా చేపట్టిన సైనిక చర్యలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో జలసంధిని తెరిచి ఉంచి నౌకలపై దాడులు జరగవని బహిరంగంగా ప్రకటించాలని అమెరికా ఇరాన్‌ను కోరింది. ఒమాన్ విదేశాంగ మంత్రితో జరిగిన సమావేశంలో నౌకల సురక్షిత ప్రయాణానికి అనుసరించాల్సిన విధానాలపై చర్చించినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఖ్చీ తెలిపారు. ప్రపంచ దేశాలు హర్మ్యూజ్‌ను అంతర్జాతీయ జలమార్గంగా పరిగణిస్తున్నప్పటికీ, యుద్ధం ప్రారంభమైన తర్వాత నుంచి ఈ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగుతుందని, ఇక్కడుగా వెళ్లే నౌకల నుంచి రుసుము వసూలు చేసే హక్కు తమకే ఉందని ఇరాన్ వాదిస్తోంది. మరోవైపు అమెరికా మాత్రం నౌకలు ఒమాన్ ప్రాదేశిక జలాల మార్గంలో ప్రయాణించాలని సూచిస్తోంది. ఇదిలాఉంటే యుద్ధ విరమణకు సంబంధించిన తాత్కాలిక ఒప్పందాన్ని అమెరికానే ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది. ఇరాన్ ముడిచమురు విక్రయాలపై అమెరికా విధించిన డాలర్ సడలింపులను రద్దు చేయడం ఒప్పందానికి విరుద్ధమని అరాఖ్చీ విమర్శించారు. ఒప్పందం అమలు కావాలంటే ఇరుపక్షాలు సమానంగా నిబంధనలు పాటించాలి అని ఆయన పేర్కొన్నారు.

మళ్లీ ఉద్రిక్తత

ఇటీవల అమెరికా దాడుల అనంతరం ఇరాన్‌పై మరోసారి వైమానిక దాడులు జరిగినట్లు సమాచారం వెలువడింది. ఆ దాడులకు ఇజ్రాయెల్ బాధ్యత స్వీకరించకపోవడంతో ఇతర గల్ఫ్ అరబ్ దేశాలు పాల్పడి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండు రోజులుగా జరిగిన దాడుల్లో కనీసం 17 మంది మృతి చెందగా, 115 మంది గాయపడినట్లు ఇరాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. పరిస్థితి మళ్లీ యుద్ధ దిశగా మళ్లే అవకాశాలపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

వియత్నాంలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మేం ముందు భాగంలో ఉండటంతో బయటపడగలిగాం. వెనుకవైపు ఉన్నవారు బోటులోనే చిక్కుకుపోయారు. భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ ప్రమాదం ఒక్కసారిగా జరిగింది అని వివరించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్ ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ ప్రాంతంతో పాటు ఇతర జలమార్గాల్లో భద్రతా ప్రమాణాలను సమీక్షించాలని సూచించారు.

మోదీ, రాష్ట్రపతి సంతాపం

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హనోయిలోని భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు కూడా ఈ ఘటనపై సంతాపం ప్రకటించారు.

సవాళ్ల మధ్య అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

అపార అవకాశాల సముద్రం ఉందన్నారు. భారత్, న్యూజిలాండ్‌లకు మరో ముఖ్యమైన సామ్యం స్వదేశీ సంస్కృతుల పరిరక్షణ అని మోదీ పేర్కొన్నారు. జనాభా పరిమాణం కంటే ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చూపే నిబద్ధతే ముఖ్యమని, ఈ విషయంలో న్యూజిలాండ్ నుంచి భారత్ ఎన్నో విషయాలు నేర్చుకుందని చెప్పారు. మహిళల సాధికారతలో న్యూజిలాండ్ ముందంజలో ఉందని, భారత్ కూడా మహిళల నేతృత్వంలోని అభివృద్ధి లక్ష్యంతో కొత్త అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. అఫ్గానిస్తాన్ సంక్షోభ సమయంలో గురుగ్రంథ్ సాహిబ్ పవిత్ర స్వరూపాన్ని అత్యంత గౌరవంతో భారత్‌కు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, వారసత్వ పరిరక్షణకు భారత్ ఎంతటి ప్రాధాన్యం ఇస్తుందో అది నిదర్శనమని మోదీ అన్నారు. న్యూజిలాండ్ భారతీయ సమాజాన్ని ఆ దేశ ప్రజలు ఆప్యాయంగా ఆదరిస్తున్నారని చెప్పారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈవో నిఖిల్ రవి శంకర్, మాజీ గవర్నర్ జనరల్ ఆనంద్ సత్యానంద, క్రికెటర్ రచిన్ రవీంద్ర వంటి భారతీయ మూలాల వ్యక్తుల విజయాలను ఆయన ప్రస్తావించారు. భారతీయ ప్రవాసులు భారత్—న్యూజిలాండ్ మధ్య స్నేహం, విశ్వాసం, సహకారానికి వారధిగా కొనసాగాలని మోదీ పిలుపునిచ్చారు. 2026 రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలకు 100 ఏళ్లు పూర్తయ్యే సందర్భంగా క్రీడా సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

మోదీ పర్యటన చారిత్రాత్మకం

ఈ సందర్భంగా మాట్లాడిన న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్, భారత ప్రధాని మోదీ పర్యటనను చారిత్రాత్మకంగా అభివర్ణించారు. 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్‌కు రావడం కుటుంబ కలయికలా అనిపిస్తోందని అన్నారు. భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా 140 కోట్ల మంది ప్రజల మార్కెట్‌కు న్యూజిలాండ్‌కు అవకాశం లభించిందని చెప్పారు. భారత్‌తో మేం కేవలం వాణిజ్యం చేయడం కాదు.. కలిసి అభివృద్ధి చెందుతున్నాం. ముఖ్యంగా " విశ్వసించే భాగస్వామిగా భారత్ నిలిచింది " అని లక్సన్ పేర్కొన్నారు.

సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

- హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్
- టీ–వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజానావ, హైదరాబాద్ :సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీ–వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంతిక సహకారంతో ఈ ంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శీధర్ బాబు తెలిపారు. సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శీధర్ బాబు వెల్లడించారు.

కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

- మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలు
- మూస్తేనే నీటి ఎత్తిపోతలకు అవకాశం.. అలాచేస్తే బ్యారేజ్‌కే ప్రమాదం
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటల వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ నేతల సూచనలతోనే మాటమార్చిన బీజేపీ ఎంపీ
- జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
- ఈటల, బీఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

ప్రజానావ, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం నీటిని ఎత్తిపోసే అవకాశం లేదని, మేడిగడ్డ బ్యారేజ్ గేట్లను ఎత్తి ఉంచాలని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గేట్లు మూసినప్పుడే కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుందని, అయితే అలా చేస్తే బ్యారేజ్‌కు మరింత ప్రమాదం ఏర్పడుతుందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించిందన్నారు. ఈ పరిస్థితుల్లో కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వ్యాఖ్యానించారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సీఎం మాట్లాడారు. కాళేశ్వరం అంశంపై బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక, ఆదేశాల మేరకే వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. ఈటల రాజేందర్‌పై తమకు వ్యక్తిగత గౌరవం ఉందని, అయితే కాళేశ్వరం విషయంలో ఆయన వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడి తన గౌరవాన్ని తానే తగ్గించుకున్నారని సీఎం అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఈటల రాజేందర్ మాట మార్చారని ఆరోపించారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న ఎంపీగా ఈటల జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డీఎస్‌ఏ అనుమతితో నీటిని ఎత్తిపోసేందుకు ఆమోదం తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అవసరమైతే కాళేశ్వరం నిర్వహణ బాధ్యతలను కూడా ఈటలతో పాటు బీఆర్ఎస్ నాయకులకే అప్పగిస్తామని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

గేట్లు మూస్తే మరింత ప్రమాదం

మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు ప్రస్తుతం ఎత్తి ఉంచడం ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల ప్రకారమేనని సీఎం తెలిపారు. గేట్లు మూసినప్పుడే కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుందని, కానీ ప్రస్తుతం బ్యారేజ్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గేట్లు మూస్తే నిర్మాణానికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. అంతేకాకుండా భద్రాచలం వరకు ముంపు ముప్పు తలెత్తుతుందని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును 2019 జూన్ 21న ప్రారంభించిన కొద్ది నెలల్లోనే మేడిగడ్డ బ్యారేజ్‌లో నిర్మాణ లోపాలు బయటపడ్డాయని సీఎం పేర్కొన్నారు. 2020 మే 18న అప్పటి ఈఈ రమణారెడ్డి ప్రభుత్వానికి లేఖ రాసి లోపాలను సరిచేయాలని సూచించినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇంజినీర్లు పలుమార్లు హెచ్చరించినా నిర్లక్ష్యం చేయడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయని ఆరోపించారు. 2022 జూలైలో వరదల కారణంగా కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిన్నప్పటి నుంచి ఇప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని తెలిపారు. అనంతరం 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని గుర్తుచేశారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో స్పష్టమైన సూచనలు

మేడిగడ్డ కుంగుబాటు ఘటన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎన్‌డీఎస్‌ఏ కమిటీ ఏర్పాటై ప్రాథమిక, తుది నివేదికలను సమర్పించిందని సీఎం తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు ప్రస్తుత పరిస్థితుల్లో నీటి నిల్వకు అనుకూలం కావని, ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసిందన్నారు. అప్పట్లోనే నిపుణులు సూచించిన సవరణలు చేపట్టి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదని పేర్కొన్నారు.

పట్టిసీమపై ఆరోపణలు నిరాధారం

కాళేశ్వరం నీటిని పట్టిసీమకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలను కూడా సీఎం కొట్టిపారేశారు. పోలవరం పూర్తయ్యే వరకు పట్టిసీమను నిర్మించిన విషయం అప్పటి సాగునీటి మంత్రి హరీశ్ రావుకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేం దుకు బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

కార్యకర్తలకు ఆదర్శంగా బండి సంజయ్ రాజకీయ ప్రస్థానం

- **జన్మదినం సందర్భంగా సిరిసిల్లలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం**
- **ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా బండి సంజయ్**
- **జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

ప్రజానావ, సిరిసిల్ల: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ రాజకీయ ప్రస్థానం ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ఒక సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన బండి సంజయ్ నేడు కేంద్ర మంత్రిగా ఎదగడం కార్యకర్తల కృషి, అంకితభావానికి నిదర్శన మని పేర్కొన్నారు. బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్న విగ్రహం వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకు నిరంతరం శ్రమిస్తూ, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా బండి సంజయ్ ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మధ్యనే ఉండే ప్రజానాయకుడిగా ఆయన సేవలంది స్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజా సింగ్, జిల్లా కార్యదర్శి సురేందర్, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి భాగయ్య, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి జలపతి రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రం, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, సెన్సార్ బోర్డు సభ్యురాలు వైశాలి, సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు కొండ వర్షిని నరేష్, మెరుగు మంజుల శ్రీనివాస్, ఉరవకొండ లక్ష్మీ రాజు, సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే
వికసిత్ భారత్ సాధ్యం

- **గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**
- **చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు కేంద్రం చారిత్రాత్మక నిర్ణయం**
- **మై భారత్ పోర్టల్ పోస్టర్ల ఆవిష్కరణ.. లోక్‌భవన్‌లో పలువురు ప్రముఖులతో భేటీ**

ప్రజానావ, హైదరాబాద్ : మహిళల సాధికారత, యువత శక్తివంతం కావడమే దేశ సమగ్రాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా నేడు తెలంగాణకు చెందిన వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్, వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ విజేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ, మహిళల రాజకీయ సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అధినియం పేరుతో 106వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే ఈ చారిత్రాత్మక నిర్ణయం దేశ రాజకీయాల్లో మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తుందన్నారు. రాబో యే 2029 ఎన్నికల తర్వాత చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి జనధన్ యోజన ద్వారా కోట్లాది మంది, ముఖ్యంగా మహిళలు, తొలిసారిగా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారని గవర్నర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలతో మహిళలను అనుసంధానం చేయడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా వారి ఖాతాలకు చేరుతోందని, దీంతో మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు పారదర్శకత కూడా పెరిగిం దని పేర్కొన్నారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే మహిళలు, యువతకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ప్రోత్సాహకాలను సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచంలోని ఏ దేశానికి వెళ్లినా భారతీయులుగానే మన గుర్తింపు ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు. విదేశాల్లో స్థిరపడిన యువతతో పాటు దేశంలోని ప్రతి యువకుడు భారతీయత, దేశ భక్తి, సాంస్కృతిక విలువలను గర్వంగా నిలబెట్టాలని కోరారు. దేశం లోని వివిధ ప్రాంతాల సంస్కృతి, జీవన విధానం, స్థానిక సమస్యలు, ప్రజల ఆచార వ్యవహారాలను తెలుసుకునే దృక్పథాన్ని యువత అలవర్చుకోవాలని సూచించారు. జాతీయ సమైక్య తను బలోపేతం చేయడంలో యువత, మహిళలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకునేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్లను గవర్నర్ ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ దినేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్ జి. రాజేష్, జిల్లా యువజన అధికారి ఆర్. శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ప్రముఖులతో గవర్నర్ భేటీ

అనంతరం లోక్‌భవన్‌లో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ లోక్‌సభ సభ్యుడు శ్రీ రామ్ భౌల్ నిషాద్, పద్మశ్రీ పురస్కార గ్రహీత శ్రీ మురళీ మోహన్, న్యూఢిల్లీకి చెందిన శ్రీ రామ్ గోపాల్ కాకా, జేబీఈఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శ్రీ జె.వి. కృష్ణారావు, పాత్ క్రియేటర్స్ (జేబీఈఎస్) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఆశిష్ చింతకాయల, గోరఖ్‌పూర్‌కు చెందిన శ్రీ ధీరజ్ దూబే తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మేనమామ హత్య.. నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కి తరలింపు

- **నిందుతుని వద్ద ఒక బైక్, హత్యకు ఉపయోగించిన బండరాయి స్వాధీనం**
- **వివరాలు వెల్లడించిన సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్**

ప్రజానావ, సిరిసిల్ల : ఈ నెల 4న రాగుల ఎల్లయ్యను హత్య చేసిన ఉదంతంలో నిందితుడు పుప్పాల శ్రీకాంత్ (35) ను అరెస్టు చేసినట్టు సిరిసిల్ల పట్టణ సిఐ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సంఘటన వివరాలు వెల్లడిస్తూ సిరిసిల్ల పట్టణంలోని బివై నగర్‌కు చెందిన పుప్పాల శ్రీనివాస్ ప్రస్తుతం వేములవాడ పట్టణం లోని న్యూ అర్బన్ కాలనీలో నివసిస్తూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే గత కొంత కాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండటంతో, సుమారు ఆరు సంవత్సరాల క్రితం అతని భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అతడిని విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శ్రీకాంత్ తన తల్లితో కలిసి సిరిసిల్లలోని బి.వై. నగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తూ, మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వాలని ఆమెను తరచూ వేధించేవాడు. సుమారు ఐదు నెలల క్రితం అతని తల్లి తన సోదరుడు రాగుల ఎల్లయ్య ఇంటికి వెళ్లగా, అక్కడికి చేరుకున్న శ్రీకాంత్ డబ్బులు ఇవ్వాలని తన తల్లిని అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవకు దిగాడు. దీనిని గమనించిన రాగుల ఎల్లయ్య, తల్లిని ఎందుకు వేధిస్తున్నావని శ్రీకాంత్‌ను అందరి సమక్షంలో తీవ్రంగా మందలించి, కర్రతో కొట్టి, అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ సంఘటనను శ్రీకాంత్ తీవ్ర అవమానంగా భావించి, తన మేనమామ రాగుల ఎల్లయ్యపై తీవ్ర కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతన్ని హత్య చేసి, తనను చూసి అందరూ భయపడేలా చేయాలని, అలాగే తన జల్సాలకు డబ్బులు అడిగినప్పుడల్లా ఇస్తారని భావించాడు. అంతే కాకుండా, రాగుల ఎల్లయ్యకు భార్య, పిల్లలు లేరనే విషయాన్ని ఆసరాగా తీసుకొని, అతన్ని హత్య చేస్తే అతని ఇల్లు తనకు దక్కుతుందని కూడా పథకం వేసుకున్నాడు. అనంతరం సుమారు నాలుగు నెలల క్రితం శ్రీకాంత్ తల్లి మరణించడంతో, తన ఖర్చులకు డబ్బులు ఇచ్చే వారు ఎవరూ లేకపోవడంతో, మేనమామను హత్య చేసి ఆయన ఇంటిని స్వాధీనం చేసుకుని, ఆ ఇంటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేయాలని గట్టిగా నిర్ణయిం చుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న సిరిసిల్ల మార్కెట్‌లో తన మేనమామ రాగుల ఎల్లయ్యను చూసిన నిందితుడు పుప్పాల శ్రీకాంత్, ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అతడిని పెద్దూరు శివారుకు తీసుకెళ్లి కల్లు, మద్యం తాగించాడు. బాధితుడు మత్తులోకి వెళ్లిన తర్వాత గొంతు నులిమి హత్య చేయడానికి ప్రయత్నించగా ప్రతిఘటించడంతో, సమీపంలో ఉన్న బండరాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం శవాన్ని పాత బట్టలతో కప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు నిందితుని పెద్దమ్మ బిడ్డ అయిన రాగుల శారద, రాగుల ఎల్లయ్య కన్పించకుండా పోయాడని, సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు పెట్టిందని తెలుసుకొని హైదరాబాద్‌కు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, సిరిసిల్ల ఎల్లమ్మ చౌక్ వద్ద పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సిఐ తెలిపారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- **చెక్కుల పంపిణీలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు**

ప్రజానావ, సిరిసిల్ల : ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఒక గొప్ప సంక్షేమ పథకమని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. పట్టణానికి చెందిన అనవేణి మనీషకు రూ.60 వేలు, మెరుపుల నరేష్‌కు రూ. 45 వేల విలువైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సూర దేవరాజు మాట్లాడుతూ.. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో మేలు చేకూరుస్తుందని కొనియాడారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ, పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కౌన్సిలర్ సూర నిర్మల, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొలనూరి రమాదేవి, సిరిసిల్ల కాంగ్రెస్ చేనేత సెల్ టౌన్ అధ్యక్షులు గుడిసెట్టి బాలరాజ్, వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, కోడం నాగభూషణం, కత్తెరపాక ఎల్లయ్య, కోలకని రాజేశం, అనవేని మల్లేశం,తడుక వెంకటేశంనర్మేట సురేష్, సదుల గంగాధర్, ఎండి కలీం, అబ్బగోని లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్‌పై పూర్తి అవగాహనతో ముందుకు సాగాలి

- **మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి**

ప్రజానావ, పెద్దపల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాజశ్రీ గార్డెన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ కమిటీ సభ్యులు సతీష్ రెడ్డి ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలు, దరఖాస్తుల సమర్పణ విధానం, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకున్నారు. ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర ఎస్ఐఆర్ కమిటీ ఇంచార్జ్ ఎల్. రమణ అధ్యక్షత వహించగా, సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

విమాన సర్వీసులను పెంచాలని కోరిన సీఎం

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ–38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ డా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానులంగా స్పందించారు.

కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

మరోమారు ప్రభుత్వంపై హరీష్‌రావు ఆరోపణలు

ప్రజానావ, సిద్దిపేట : ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, సీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదిం చాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా సీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిం చారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం డా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో ఆరు హత్యలు..
సీఎం రేవంత్ రాజీనామా చేయాలి

- **తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**
- **శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది**
- **నేరెళ్ల బాధితుడు గంధం గోపాల్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం**

ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు హత్యకు గురికావడం అత్యంత అమానుషమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి, హోంమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. ఫోక్సో కేసులో అరెస్టై బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు బాలికపై అత్యాచారం చేసి హత్య చేయడంతో పాటు ఆమె తల్లి, నానమ్మను, అనంతరం తన భార్య, పిల్లలను కూడా హత్య చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ఇన్ని హత్యలు జరుగుతున్నా నిఘా వ్యవస్థ, పోలీసులు అడ్డుకోలేక పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికీ నిందితుడు పరారీలో ఉండటం ప్రభుత్వ చేతకానితనమేనని ఆరోపిస్తూ, అతడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితుడు గంధం గోపాల్ మృతి కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కవిత తెలిపారు. 2017లో నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ఘటనలో పోలీసుల చిత్రహింసలకు గురైన గోపాల్ గత పదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడం బాధాకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఆ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. బాధితులకు అండగా ఉంటామని చెప్పిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా మాట నిలబెట్టుకోలేదని అన్నారు. గంధం గోపాల్ మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ, త్వరలోనే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తానని, వారికి పూర్తి న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన తరఫున పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

వియత్నాం బోటు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

- **ఎంబసీతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశం**
- **ముమ్మరం చేసిన సహాయక చర్యలు**

ప్రజానావ, హైదరాబాద్ : వియత్నాంలో జరిగిన బోటు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపంలో పర్యటనకు వెళ్లిన భారతీయులు బోటు ప్రమాదంలో మృతిచెందారనే సమాచారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. వియత్నాం పర్యటనకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు పర్యాటకులు అక్కడ బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను తెలుసుకోవడంతో పాటు సహాయక చర్యలను ముమ్మరం చేయడంలో కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు వియత్నాంలోని భారతీయ ఎంబసీ కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రమాదంలో తెలుగువారు ఉన్నారని ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో పూర్తి సమాచారం తెలుసుకోవాలని సీఎం సూచించారు. ఈ ఘటనలో క్షతగాత్రులకు అవసరమైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. బాధితులకు తమ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా కల్పించారు. బాధితుల కుటుంబాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 4 హెల్ప్‌లైన్ నంబర్లు విడుదల చేసినట్లు చెప్పుకొచ్చారు. సమాచారం కోసం వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

బండి సంజయ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

ప్రజానావ, సిరిసిల్ల : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు వంగ అనిల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు కలిపి 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడెపు రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు మామి డాల మహేష్, ఉరగొండ రాజు, మేర్గు శ్రీనివాస్, కొండ నరేష్, ఎర్రం విజయరా మరాజు, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు వేముల వైశాలి, జింక అనిల్, కోడం రవి, బూర విష్ణు, ఎనగంటి నరేష్, మోర శ్రీహరి, కాంబోజు శ్రీధర్, పోతు శ్రీనివాస్, దేవనపల్లి భాస్కర్, గాలి శ్రీనివాస్, సంగీతం సత్యసాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
☎ 9948433277, 9014966169

EDITORIAL

గందరగోళంగా సర్ ప్రక్రియ!

> 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఈసీ స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బీఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు.

సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు.'సర్' పక్రియలో సాంతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతా రు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఓ వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' ప్రక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకో వడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకుదెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగు వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాలలో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహా నగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

> తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహా నగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

గజ్వేల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

ప్రజానావ, గజ్వేల్ : గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరితో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. న్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి దశలవారీగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో రూ.3.52 కోట్లతో నూతన ఆర్టీసీ బస్టాండ్

- మహాలక్ష్మి పథకంతో రోజూ 35 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం
- ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజానావ, సూర్యాపేట : హుజూర్‌నగర్‌లో రూ.3.52 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక ఆర్టీసీ బస్టాండ్‌కు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సులు సేవలందిస్తున్నాయని, రోజూ సుమారు 35 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నా రని చెప్పారు. ఇప్పటివరకు 326 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదవగా, మహిళలకు రూ.11,400 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాలకు 600 బస్సులు అందించి ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముం దుకు సాగుతోందని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సన్నబియ్యం అందించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. హుజూర్‌న గర్‌లో ఆధునిక బస్టాండ్ నిర్మాణంతో ప్రయాణికు లకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కవిత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల కంటికి రక్షణ కవచం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులకు ఉచిత కంటి పరీక్షల శిబిరం
- అవసరమైతే ఉచిత కళ్లద్దాలు, శస్త్రచికిత్సలు అందిస్తామని భరోసా

ప్రజానావ, సిద్ధిపేట : సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి పేద ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే అభివృద్ధికి పునాదని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అత్యాధునిక కంటి వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. పేదలకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా కంటి పరీక్షలు, చికిత్సలు, అవసరమైతే శస్త్రచికిత్సలు అందించడం ఈ ఆసుపత్రి ప్రధాన ఉద్దేశమన్నారు. హైదరాబాద్‌కు వెళ్లే స్థోమత లేని వారికి జిల్లాలోనే ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఇప్పటికే వేలాది మంది కంటి పరీక్షలు చేయించుకోగా, అనేక మందికి విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. ఆటో, బస్సు, లారీ డ్రైవర్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్‌లు వంటి వృత్తుల్లో ఉన్నవారు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఎవరికైనా కళ్లద్దాలు అవసరమైతే ఉచితంగా అందిస్తామని, శస్త్రచికిత్స అవసరమైతే పూర్తిగా ఉచితంగా చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యమే నిజమైన అభివృద్ధికి సూచిక అని పేర్కొంటూ, సిద్దిపేటను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు సమాజానికి కీలక సేవలు అందిస్తున్నారని, వారి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు కొనసాగాలని, ప్రజా సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

శిథిల భవనానికి బదులుగా కొత్త పాఠశాల నిర్మించాలి

తరగతి గది పైకప్పు కూలిపోవడంతో భయాందోళన

ప్రజానావ, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. పాఠశాల ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేసిన వారు, శిథిలావస్థకు చేరిన భవనంలో విద్యార్థులను చదివించడం ప్రాణాలకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పాఠశాలలోని ఒక తరగతి గది పైకప్పు కూలిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడైనా మరింత పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వెంటనే పాత భవనాన్ని తొలగించి అన్ని సౌకర్యాలతో కూడిన నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి పొంగులేటి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తాం
- రూ.35.91 లక్షల సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ప్రజానావ, ఖమ్మం : ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు రూ.35,91,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిరుపేదలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో తోడ్పాటుగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలే రేవంత్ ఎజెండా

- ఒక్క కంటితో చేసిన అభివృద్ధిని ముగ్గురు మంత్రులు చేయలేకపోయారు
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం
- మజీ మంత్రి పువ్వాడ అజయ్

ప్రజానావ, ఖమ్మం : ప్రజానావ, ఖమ్మం: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హననమే పాలన ఎజెండాగా మార్చుకున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తాను ఒక కన్ను కోల్పోయిన విషయాన్ని అప్పట్లోనూ, ఇప్పుడూ ప్రస్తావిస్తూ తన అంగవైకల్యాన్ని కించపరిచేలా మాట్లాడటం రేవంత్‌రెడ్డి సంస్కారానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంగవైకల్యం అడ్డొచ్చిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు ఉన్న ఒక్క కన్నుతోనే ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేశానని, ఆ అభివృద్ధిని ప్రస్తుతం అధికారంలో ఉన్న ముగ్గురు మంత్రులు తమ ఆరు కళ్లతో కూడా చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కనీస విషయ పరిజ్ఞానం లేకుండా ముఖ్యమంత్రి తన హోదాను మరిచి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తనపై ముఖ్యమంత్రి, మంత్రులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వ్యక్తిగత విమర్శలతో తాత్కాలిక సంతృప్తి పొందవచ్చేమో గానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించిన ఆయన, దేవుళ్లపై ఒట్లు పెట్టి కూడా రైతు రుణమాఫీ అమలు చేయలేదని, మూడు సీజన్ల రైతు భరోసాను కూడా ఇవ్వకుండా రైతులను నిరాశపరిచిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేద ని విమర్శించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఒక్క కన్నుతోనే గోదావరి వరద పరిస్థితులను సమర్థంగా పర్యవేక్షించి ప్రజలకు అండగా నిలిచానని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావం పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ రైతులకు విడుదల చేయ కుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టును తానే తీసుకొచ్చానంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకోవడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సీతారామ ప్రాజెక్టు కోసం రూ.9 వేల కోట్ల వ్యయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా చేసినది ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు వినియోగిస్తున్న గోదావరి జలాలు కూడా కేసీఆర్ కృషి ఫలితమేనని పేర్కొన్నారు. గోదావరి నీటిని కృష్ణా నదిలోకి మళ్లించే ఆలోచనను కేసీఆరే కార్యరూపం దాల్చేలా చేశారని, మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో చంద్ర బాబు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను వినియో గించుకుంటున్నా తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి చూపడం లేదని పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు.

యాదాద్రి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

- చైర్మన్‌గా మన్నె సత్యనారాయణరెడ్డి బాధ్యతల స్వీకరణ
- హాజరైన మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజానావ, యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు (పాలక మండలి) ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కార్యక్రమంలో దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా మన్నె సత్యనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే నామినేటెడ్ సభ్యులు కొణిదెల సురేఖ, జి. వినోద్ వెంకటస్వామి, చిలప్పు విజయరాజం, విజయేందర్ తుల్ల, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంతమనేని, ఎం. రాఘవేంద్రరావు, డి. లక్ష్మీ నారాయణ నాయక్‌లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రం తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, పారదర్శక పరిపాలన, సత్వర సేవలు అందించేలా నూతన పాలక మండలి పనిచేయాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీరు, వసతి, క్యూ లైన్లు, అన్నదాన సేవలు, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రాన్ని దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో ఐఏఎస్ అధికారి భవాని శంకర్, ఆలయ ప్రధాన అర్చకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలి

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జీసీడీఓ అస్త్ర ఖాద్రి ఆకస్మిక తనిఖీ

ప్రజానావ, మహబూబ్‌నగర్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జీసీడీఓ అస్త్ర ఖాద్రి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యాబోధన, విద్యార్థినుల హాజరు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, అందరూ ఐక్యంగా పనిచేసి విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రత్యేక అధికారిణి కవిత వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో సీఆర్టీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. విద్యాలయంలో ఖాళీగా ఉన్న మూడు వంట మనిషి పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జీసీడీఓ అస్త్ర ఖాద్రి హెచ్చరించారు.

14లోపు సర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- ఎస్ఐఆర్ నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- అర్హ ఓటరు ఒక్కరూ మిస్ కాకుండా చర్యలకు ఆదేశం

ప్రజానావ, హనుమకొండ : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. శనివారం గాంధీనగర్, అశోక్ కాలనీ, గోకుల్ నగర్, లష్కర్ సింగారం, లష్కర్ బజార్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)తో మాట్లాడిన కలెక్టర్, ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ పురోగతి, పెండింగ్ వివరాలను సమీక్షించారు. లష్కర్ బజార్ పరిధిలో డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సంబంధిత బీఎల్ఓను మందలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 14లోపు ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ అందిన దరఖాస్తులను అదే రోజు డిజిటలైజ్ చేసి పెండింగ్ లేకుండా చూడాలని, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని సూచించారు. డిజిటలైజేషన్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ ఏపీఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏఏలు, రిసోర్స్ పర్సన్ల సేవలను వినియోగించుకుని బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి అర్హ ఓటరును గుర్తించి వారి దరఖాస్తులను సకాలంలో స్వీకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

- ఫొటో లేని ఓటరు నమోదు దరఖాస్తు స్వీకరించలేదనే ఆగ్రహం
- విధులకు ఆటంకం కలిగించి బెదిరింపులు, తోపులాట.. పోలీసుల కేసు

ప్రజానావ, కామారెడ్డి : రామేశ్వపల్లి గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక నమోదు కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)పై దాడి జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. రామేశ్వపల్లి గ్రామానికి చెందిన బీఎల్ఓ ఠాకూర్ అనిత జూలై 10న లిమ్రా ఫంక్షన్ హాల్ సమీపంలో ఓటరు నమోదు విధులు నిర్వహిస్తుండగా ఉజ్మా బేగం ఫోటో లేకుండా నమోదు దరఖాస్తు సమర్పించింది. దరఖాస్తులో ఫోటో లేకపోవడంతో నిబంధనల ప్రకారం స్వీకరించలేమని బీఎల్ఓ తెలిపింది. దీంతో ఉజ్మా బేగంతో పాటు మరో మహిళ, గుర్తు తెలియని వ్యక్తి బీఎల్ఓ విధులకు ఆటంకం కలిగించి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు చేతి పట్టుకుని తోసివేసి, ఆమె వద్ద ఉన్న విధుల సంచిని లాక్కొనే ప్రయత్నం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన మరో వ్యక్తి చంపేస్తానంటూ బెదిరించినట్లు తెలిపారు. అక్కడే ఉన్న పర్యవేక్షకులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉజ్మా బేగం, మరో మహిళ, గుర్తు తెలియని వ్యక్తిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు.

బస్టాండ్‌ను ప్రయాణికులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి

- గోదావరిఖని బస్టాండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

ప్రజానావ, రామగుండం : రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శనివారం గోదావరిఖని బస్టాండ్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. బస్టాండ్‌లో ఆధునిక ప్లాట్‌ఫారమ్‌లు, ప్రత్యేక ఆటో స్టాండ్, ఆటో డ్రైవర్లకు విశ్రాంతి సౌకర్యాలు, తాగునీటి వసతి, వాష్‌రూమ్‌లు, ఫుట్‌పాత్‌లు, పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్టాండ్ అభివృద్ధి పనులు చేపట్టి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సింగరేణి జనరల్ మేనేజర్, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ సర్వే

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వేనే కీలకం
- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయాలి
- రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలి
- ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందించాలి
- భూ రీ సర్వే, సాదాబైనామా దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవెన్యూ రాష్ట్ర మంత్రి

ప్రజానావ, పెద్దపల్లి : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ–సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ–సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2 బీహెచ్ కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఖమ్మం జిల్లా సమీకృత కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ పాల్గొన్నారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ–సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ–సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ–సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీ–సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ–సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి–2027 నాటికి మూడు విడతల్లో రీ–సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ–సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ–సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2 బీహెచ్ కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు అనంతరం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ–సర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి–2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ–సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 41 వేల గుడిసెలను గుర్తించామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2 బీహెచ్ కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు భాగస్వాములయ్యారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, రెవెన్యూ డివిజనల్ అధికారి బి. గంగయ్య, సురేష్, ఏ.డి.సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సంక్షేమ శాఖ మంత్రి
- వేదాశీర్వచనం అందించిన అర్చకులు
- శాలువాతో సత్కరించిన దేవస్థాన అధికారులు

ప్రజానావ, జగిత్యాల : తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. మంత్రి శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన శ్రీ బేతాళస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రికి వేదాశీర్వచనం అందించగా, దేవస్థాన ఈవో ఎస్. అంజనారెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, రాజేందర్ రెడ్డి, ఎస్పై సందీప్, ఏఎస్పై రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మపురిలో 90,761 మంది రైతులకు రూ.87.21 కోట్ల రైతు భరోసా
- బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం
- తాగునీరు, విద్య, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

ప్రజానావ, ధర్మపురి : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలోని 90,761 మంది రైతుల ఖాతాల్లో రూ.87.21 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో 2,29,213 మంది రైతులకు రూ.243.40 కోట్లు, రాష్ట్రవ్యాప్తంగా 70,40,286 మంది రైతులకు రూ.875.96 కోట్ల రైతు భరోసా విడుదల చేసినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో ధర్మపురి అభివృద్ధికి దూరమైందని ఆరోపించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. రోడ్లవాగు ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం కమిషన్లకే ప్రాధాన్యం ఇచ్చిందని, అక్కపల్లి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు చేయడంతో పాటు రూ.10 కోట్ల సీఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యాదవ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించామని, గోదావరిలో మురుగు నీరు కలవకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాం ట్ నిర్మిస్తున్నామని చెప్పారు. కుల సంఘాల భవనాల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 149 గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, మహిళా సంఘాల వీవో భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపా రు. అభివృద్ధి పనులపై కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించిన మంత్రి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించి ధర్మపురిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ఆరోగ్య సమస్యల అవగాహనపై.. నర్సింగ్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

- సిరిసిల్ల రాజీవ్ నగర్‌లో ఫీల్డ్ క్యాంప్

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించడం, ప్రాథమిక ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా సిరిసిల్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు శనివారం హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్ లో ఫీల్డ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని కుటుంబాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, పోషకాహార లోపం, వ్యక్తిగత పరిశుభ్రత, తల్లి–శిశు ఆరోగ్యం, వృద్ధుల ఆరోగ్య సమస్యలు, అంటువ్యాధులు మరియు జీవనశైలి సంబంధిత వ్యాధులపై సమాచారం సేకరించారు. అలాగే ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నర్సింగ్ విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే నిర్వహించడం, అవసరమైన వారికి సమీప ప్రభుత్వ ఆసుపత్రులు మరియు ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి భవిష్యత్తులో అవసరమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఉపయోగపడే సమాచారాన్ని సేకరించారు. ఈ ఫీల్డ్ క్యాంప్‌లో హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, ప్రముఖ సైకాలజిస్ట్ పున్నంచందర్ కనుకుంట్ల, అడ్వకేట్ దాసరి తిరుమల, డాక్టర్ అలువాల సుమంత్, వార్డు కౌన్సిలర్ మామిడాల మహేష్, కొండ ప్రకాశ్, వంతడుపుల రాము, గొల్లపల్లి బాలయ్య, వంగరీ అనిల్,కళాశాల అధ్యాపకులు సుశీల, గ్లోరి , సంధ్యారాణి, స్వరూప స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు మరియు గ్రామస్థులు పాల్గొని విద్యార్థుల సేవలను అభినందించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు నిధులు కేటాయించాలి

- ఎంపీ గోడం నగేష్‌కు టీజీ పీడీ, పీఈటీల సంఘం వినతి
- జాతీయ స్థాయి క్రీడాకారులకు రైల్వే రాయితీ పునరుద్ధరణతో పాటు సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు విజ్ఞప్తి

ప్రజానావ, ఆదిలాబాద్ : పాఠశాల స్థాయి నుంచే ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయిలో రాణించేలా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)కు తగిన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీజీ పీడీ, పీఈటీల సంఘం కోరింది. ఈ మేరకు శనివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర క్రీడా జట్లకు గతంలో అమలులో ఉన్న రైల్వే టికెట్ రాయితీని పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు. రైల్వే రాయితీ లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం కష్టంగా మారిందన్నారు. ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పెంచేలా చర్యలు తీసుకోవాలని, గిరిజన, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్‌తో పాటు జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేందుకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్‌ను శాలువాతో సత్కరించి సంఘం డైరీని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కాంతారావు, ప్రధాన కార్యదర్శి స్వామి, గౌరవ సలహాదారు డీవైఎస్‌వో దయానంద్ రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రజలతోనే కనెక్ట్ అయ్యారు

- **మధ్యలో ఇతరుల జోక్యం కోరుకోరు**
- **మీడియాను దూరంగా పెట్టడంపై జర్నలిస్ట్ ప్రశ్న**
- **విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ జవాబు**

ఆక్లాండ్ : ప్రస్తుతం మూడు దేశాల పర్యటనలో భాగంగా న్యూజిలాండ్‌లో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ కమ్యూనిషన్ స్టైల్‌పై అంతర్జాతీయ మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారత రాయబార కార్యాలయ అధికారులతో జరిగిన ఓ ముఖాముఖి సమావేశంలో, ఓ స్థానిక జర్నలిస్ట్ నేరుగా దౌత్యవేత్తలను ఉద్దేశించి 'ప్రధాని మోదీ మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరని ప్రశ్నించారు. దీనికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి, ప్రముఖ దౌత్యవేత్త రుద్రేంద్ర టాండన్ అత్యంత చాకచక్యంగా స్పష్టమైన సమాధానమిచ్చారు. జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందిస్తూ.. ప్రధాని రాజకీయ వ్యూహాలను ఒక ప్రభుత్వ అధికారిగా తాను ప్రశ్నించలేనని చెప్తూనే, భారతీయ రాజకీయాల నేపథ్యాన్ని వివరించారు. 'ప్రధాని మోదీ పక్కా భారతీయ రాజకీయవేత్త. సాధారణంగా భారతీయ నాయకులు తమ ఓటర్లతో నేరుగా సంబంధాలు కలిగి ఉండటాని ఇష్టపడతారు. మధ్యవర్తులు లేదా మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడటం కంటే, నేరుగా ప్రజల తమ సందేశాన్ని చేరవేయాలని భావిస్తారు' అని టాండన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ 'డైరెక్ట్ కాంటాక్ట్' విధానంలో అద్భుతమైన నైపుణ్యం సాధించారని, అందువల్లే ఆయన భారతదేశంలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానులలో ఒకరిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలు ఆయన విధానాన్ని ఆదరించబట్టే వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చారని దౌత్యవేత్త స్పష్టం చేశారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఇలాంటి ప్రశ్నలు రావడం ఇదేం మొదటిసారి కాదు. గత మేలో నార్వే రాజధాని ఓస్లో పర్యటన సందర్భంగా డా అక్కడి ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కలిసి మోదీ సంయుక్తంగా మీడియా ముందుకు వచ్చినప్పుడు.. హెల్ లింగ్ అనే నార్వేజియన్ జర్నలిస్ట్ ప్రధాని మోదీని ఉద్దేశించి 'మీరు జర్నలిస్టుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరు?' అని బహిరంగంగా అడిగారు. అప్పట్లో ఈ అంశం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.

బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనుల్లో విషాదం

కరెంట్ షాక్‌తో నలుగురు కార్మికుల దుర్మరణం

చెన్నై : తమిళనాడులో విషాద ఘటన చోటుచేసుకుంది. చెంగల్పట్టు జిల్లా మామల్లపురంలో బోర్‌వెల్ తవ్వకాల సమయంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం మామల్లపురం ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ ఎదురుగా బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో డ్రిల్లింగ్ యంత్రం సమీపంలోని విద్యుత్ లైన్‌కు తాకినట్లు సమాచారం. విద్యుత్ తీగలకు డ్రిల్లింగ్ యంత్రం తగలడంతో ఒక్కసారిగా కరెంట్ ప్రవహించింది. అక్కడే పనిచేస్తున్న నలుగురు కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, సహాయక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ఘటనకి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించి, అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు.

నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

- **వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి**
- **ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తాం**
- **సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను**
- **సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు**

వాషింగ్టన్ : అమెరికా–ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటి 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటి లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటి ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో డా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటి హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటి సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటి అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటాం



అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ నుంచి మరోసారి ఘాటు వ్యాఖ్యలు వెలువడ్డాయి. తమ సుప్రీం నేత, తన తండ్రి అయతొల్లా ఖమేనీని హతమార్చిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నానని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన రాతపూర్వక సందేశంలో ప్రతీకారం తీర్చుకోవడం ఇరాన్ ప్రజల డిమాండ్ అని, దానిని తప్పకుండా నెరవేర్చాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నా రు. ఇదే సమయంలో గత నెలలో అమెరికాతో కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించి దాడులకు పాల్పడినా ఎదుర్కొనేందుకు తమ దేశం పూర్తిస్థాయి లో సిద్ధంగా ఉందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ తెలిపారు. అమెరికాపై తమకు ఏమాత్రం నమ్మకం లేదని, చర్చల సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్‌కు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు చెప్పారు. హొర్ముజ్ జలసంధిలో పరిస్థితులు సాధారణ స్థితికి రావాలంటే ఇరాన్ ప్రతిపాదించిన షరతులను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు శనివారం టెహ్రాన్‌లో వినిపించిన భారీ పేలుడు శబ్దం పాత ప్రమాదకరమైన మందుగుండు సామగ్రిని నిర్వీర్యం చేసే ప్రక్రియలో భాగంగానే సంభవించిందని ఇరాన్ అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, యుద్ధంలో దెబ్బతిన్న తమ అణు మౌలిక సదుపాయాలను పునర్నిర్మించేందుకు ఇరాన్ చర్యలు చేపట్టినట్లు తాజా ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నా యి. ఈ ఏడాది ప్రారంభంలో దెబ్బతిన్న పర్చిన్ అణు సముదాయంలో పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఆ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు సమాచారం. దీనిపై స్పందించిన ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్‌లో ఇరాన్‌ను లక్ష్యంగా వెయ్యి క్షిపణులు సిద్ధంగా ఉంచామని, ఒకవేళ తమపై ఎలాంటి దాడి లేదా బెదిరింపులను అమలు చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే క్షణాల్లోనే భారీ స్థాయిలో ప్రతిదాడి జరుగుతుందని హెచ్చరించారు. తన హత్యకు సంబంధించిన కుట్రలు, బెదిరింపుల నేపథ్యంలోనే ఈ వ్యాఖ్యలు చేసినట్లు ట్రంప్ వెల్లడించారు.

పూణె మోషి భవన ప్రమాదం

6 మంది మృతి, 3 మంది కోసం గాలింపు కొనసాగింపు

ప్రజానావ, ముంబై: పూణెలోని మోషి వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులో భవనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఇప్పటివరకు 16 మందిని రక్షించగా, మరో ముగ్గురి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న ఉద్యోగి విజయ్ సప్కల్ తన భార్యకు సెల్ఫీ పంపి, నేను భవనం కింద చిక్కుకున్నాను... త్వరగా రా అని సందేశం పంపాడు. సుమారు తొమ్మిది గంటల పాటు శిథిలాల కింద చిక్కుకున్న అతడిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీశాయి. ప్రస్తుతం అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కాంట్రాక్టర్ రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

300 మంది అమెరికా నేవీ క్యాడెట్లకు

భారతీయ యువతి నాయకత్వం

- **న్యూయార్క్ హైస్కూల్‌లో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా రిద్ధి చౌహాన్**
- **ఎన్‌జేఆర్‌ఓటీసీ కార్యక్రమంలో అత్యున్నత విద్యార్థి హోదా**

న్యూఢిల్లీ: భారతీయ సంతతికి చెందిన 17 ఏళ్ల విద్యార్థిని రిద్ధి చౌహాన్ అమెరికాలో అరుదైన గుర్తింపు సాధించింది. న్యూయార్క్‌లోని బెంజమిన్ కార్డోజో హైస్కూల్‌లో నేవీ జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్ (ఎన్‌జేఆర్‌ఓటీసీ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టి సుమారు 300 మంది నేవీ క్యాడెట్లకు నాయకత్వం వహిస్తోంది. ఈ కార్యక్రమంలో అత్యున్నత ర్యాంకు సాధించిన విద్యార్థిగా నిలిచిన రిద్ధి ప్రస్తుతం అమెరికా యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా ఆమె బెటాలియన్ కార్యకలాపాలు, శిక్షణ, విద్యార్థుల సంక్షేమం, క్రమశిక్షణ వంటి అంశాలను పర్యవేక్షిస్తూనే తన విద్యాభ్యాసాన్ని కూడా సమర్థంగా కొనసాగిస్తోంది. ప్రతిరోజూ పాఠశాలలో క్యాడెట్లకు డ్రిల్ శిక్షణ అందిస్తూ నాయకత్వ లక్షణాలను ఆచరణలో చూపిస్తోంది. అమెరికా నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్‌జేఆర్‌ఓటీసీ కార్యక్రమం అమెరికాలోని హైస్కూళ్లలో విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, జట్టు భావనను పెంపొందించేందుకు నిర్వహించబడుతుంది. తాను నాయకత్వ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో చేరానని రిద్ధి చౌహాన్ తెలిపింది. తన ప్రతిభ, పనితీరు తో అందరి ప్రశంసలు అందుకుంటున్న ఆమె భవిష్యత్‌లో అమెరికా నావల్ ఆఫీసర్‌గా సేవలందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా ఎంపికకు ముందు అకాడెమిక్ కమాండర్, స్టెమ్ కమాండర్, ప్లాటూన్ లీడర్, ఇన్‌స్పెక్షన్ కమాండర్ వంటి పలు కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించింది. ఆ హోదాల్లో పనిచేసే సమయంలో దాదాపు 200 మంది క్యాడెట్లకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించింది. ప్రస్తుతం నావల్ అకాడమీ ప్రిపరేటరీ స్కూల్‌లో ప్రవేశం పొందేందుకు ప్రయత్నిస్తున్న రిద్ధి, అనంతరం అమెరికా నావల్ అకాడమీలో చేరి యునైటెడ్ స్టేట్స్ నావల్ ఆఫీసర్‌గా సేవలందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రిద్ధి చౌహాన్ తల్లిదండ్రులు రాజస్థాన్‌కు చెందిన రుచిక, దిలీప్ చౌహాన్. ప్రస్తుతం వారు న్యూయార్క్‌లో స్థిరపడ్డారు. ఆమె సోదరి కహిని గుప్తా చౌహాన్ వైద్య వృత్తిలో సేవలందిస్తోంది.

నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు

- **3,035 మంది టీచర్లు బర్తరఫ్**
- **బీహార్ ప్రభుత్వ సంచలన చర్య**
- **రూ.1,400 కోట్ల జీతాలను వడ్డీతో సహా రికవరీ చేయాలని నిర్ణయం**

పాట్నా: నకిలీ విద్యార్హతలు, ధ్రువపత్రాల ఆధారంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన 3,035 మంది టీచర్లను బీహార్ విద్యాశాఖ శనివారం విధుల నుంచి బర్తరఫ్ చేసింది. అంతేకాకుండా, వీరికి గత కొన్నేళ్లుగా జీతాల రూపంలో చెల్లించిన సుమారు రూ.1,400 కోట్లను వడ్డీతో సహా తిరిగి వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2006 నుంచి 2015 మధ్య స్థానిక సంస్థల ద్వారా నిర్వహించిన ఉపాధ్యాయ నియామకాలలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు సమగ్ర విచారణలో తేలడంతో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ఈ నియామకాలపై దర్యాప్తు జరపాలని పాట్నా హైకోర్టు విజిలెన్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోను ఆదేశించిన అనంతరం విచారణ చేపట్టగా, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వేలాది మంది ఉపాధ్యాయుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విచారణ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఒకేసారి 3,035 మంది ఉపాధ్యాయులను సేవల నుంచి తొలగించడంతో పాటు, వారికి ఇప్పటివరకు చెల్లించిన వేతనాన్ని వడ్డీతో సహా తిరిగి రాబట్టేందుకు చర్యలు ప్రారంభించింది.

అదానీని ప్రశ్నించిన అమెరికా కోర్టు

- **లంచం కేసు ఉపసంహరణ అభ్యర్థనపై కీలక విచారణ**
- **తెరవెనుక ఒప్పందాలు, హామీలు, క్విడ్‌ప్రోకో అంశాలపై వివరాలు కోరిన న్యాయస్థానం**
- **పెట్టుబడుల హామీతో నిర్ణయం తీసుకున్నారన్న ప్రచారం**

న్యూయార్క్: లంచం కేసులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీతో పాటు మరో ఏడుగురిపై నమోదైన క్రిమినల్ అభియోగాలను ఉపసంహరించాలంటూ అమెరికా ప్రభుత్వానికి సమర్పించిన అభ్యర్థనపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఎవరైనా ఏదైనా హామీ ఇచ్చారా? ఎలాంటి ఆఫర్ చేశారా? లేదా పరస్పర ప్రయోజనాల కోసం క్విడ్‌ప్రోకో తరహా ఒప్పందం కుదిరిందా? అనే అంశాలపై పూర్తి వివరాలను వెల్లడించాలని గౌతమ్ అదానీని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆదేశించింది. ఈ మేరకు యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నికోలస్ జీ గరాఫిస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు అదానీపై నమోదైన అభియోగాలను ఎందుకు ఉపసంహరించుకోవాలనుకుంటున్నారో వివరణ ఇవ్వాలని కోర్టు అమెరికా ప్రభుత్వాన్ని ఆదేశించగా, ప్రిన్సిపల్ అసోసియేట్ డిప్యూటీ అటార్నీ జనరల్ ఆర్. ట్రెంట్ మెక్‌కాటర్ కోర్టుకు సమాధానం సమర్పించారు. ఈ నిర్ణయం పూర్తిగా తన స్వతంత్ర నిర్ణయమేనని, ఇందులో తానే తుది, ఏకైక నిర్ణేతనని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలో భారీ పెట్టుబడులు పెడతామని గౌతమ్ అదానీ హామీ ఇవ్వడంతోనే కేసు ఉపసంహరణకు ప్రభుత్వం మొగ్గుచూపిందన్న కథనాలను ఆయన ఖండిస్తూ, అలాంటి ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కోర్టుకు తెలిపారు.

15 నుంచి కొత్త ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్

- **టికెట్ బుకింగ్ మరింత వేగంగా**
- **ప్రయాణికులకు సులభమైన బుకింగ్ అనుభవమే లక్ష్యం**
- **ప్రకటనలు తక్కువ.. సులభమైన క్యాప్చా..**
- **ఒకే స్క్రీన్‌పై అన్ని తరగతుల సీట్ల లభ్యత**
- **వ్యక్తిగత వివరాలు ఒక్కసారే నమోదు చేసే వెసులుబాటు**

న్యూఢిల్లీ : రైలు టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌ను మరింత వేగవంతం, సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. జూలై 15 నుంచి ఈ కొత్త ప్లాట్‌ఫారమ్ బీటా వెర్షన్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అప్‌గ్రేడ్ చేసిన ఈ వెబ్‌సైట్‌పై ఐఆర్‌సీటీసీ తుది దశ పనులు చేపట్టింది. ప్రస్తుతం ప్రయాణికులు ఎదుర్కొంటున్న నెమ్మదిగా లోడ్ కావడం, క్లిష్టమైన క్యాప్చాలు, తరచూ కనిపించే పాప్–అప్ ప్రకటనలు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ఈ కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇందులో తక్కువ గ్రాఫిక్స్, ప్రకటనలు లేని సరళమైన ఇంటర్‌ఫేస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. కొత్త క్యాప్చా విధానం కూడా చిన్నదిగా, సులభంగా ఉండటంతో లాగిన్, టికెట్ బుకింగ్, చెల్లింపు ప్రక్రియలు వేగంగా పూర్తయ్యేలా రూపొందించారు. అలాగే స్లీపర్, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ తదితర అన్ని తరగతుల్లో సీట్ల లభ్యతను ఒక్కో తరగతిగా విడివిడిగా చూడాల్సిన అవసరం లేకుండా ఒకే స్క్రీన్‌పై పరిశీలించే సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. టికెట్ బుకింగ్‌కు అవసరమైన దశలను తగ్గించడం ద్వారా మొత్తం బుకింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించనున్నారు. తరచూ రైలు ప్రయాణాలు చేసే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కల్పించేలా వ్యక్తిగత వివరాలను ఒక్కసారి మాత్రమే నమోదు చేస్తే, వాటిని వెబ్‌సైట్‌లో భద్రపరిచి భవిష్యత్ బుకింగ్‌ల సమయంలో మళ్లీ నమోదు చేయాల్సిన అవసరం లేకుండా కొత్త వ్యవస్థను రూపొందించారు. ఈ మార్పులతో ఐఆర్‌సీటీసీ టికెట్ బుకింగ్ ప్రక్రియ మరింత వేగవంతం, సులభతరం అవుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

పోక్సో కేసులో టీవీ నటుడు రోహిత్ చందేల్ అరెస్ట్

ప్రజానావ, ముంబై: పాండ్యా స్టోర్ ఫేమ్ టీవీ నటుడు రోహిత్ చందేల్‌ను 16 ఏళ్ల మైనర్ బాలికను వేధించడం, వెంబడించడం, దాడి చేసిన ఆరోపణలపై ముంబై పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. జూలై 10న దహిసర్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకుని ప్రత్యేక పోక్సో కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆయనను కస్టడీకి పంపింది. పోలీసుల సమాచారం ప్రకారం, బాధిత బాలికకు పదేపదే ఫోన్ చేసి వేధించడం, ఆమె ఇంటి వద్ద అడ్డగించి వెంబడించడం, ప్రతిఘటించడంతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పంత్‌నగర్ పోలీసులు పోక్సో చట్టంతో పాటు సంబంధిత భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆరోపణలపై కోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

వెనుజులాను వణికించిన భూకంపాలు

- **4 వేలకుపైగా మృతులు**
- **శిథిలాల కింద ఇంకా వేలాది మంది చిక్కుకున్నట్లు అంచనా**
- **మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం**
- **కారకాస్‌లో మరోసారి భూప్రకంపనలు**

వెనుజులా: గత నెల 24న వెనెజులాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు దేశాన్ని తీవ్ర విషాదంలో ముంచేశాయి. ఈ ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 4 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు వెనెజులా ప్రభుత్వం వెల్లడించింది. మరో 16,740 మంది గాయపడగా, అనేక భవనాలు కూలిపోవడంతో వేలాది మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకా పలువురి ఆచూకీ లభించకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇదే సమయంలో శుక్రవారం రాజధాని కారకాస్‌లో రిక్టర్ స్కేలుపై 3.0 తీవ్రతతో మరో భూకంపం సంభవించడంతో అప్రమత్తమైన అధికారులు పలు భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు భూకంప బాధితుల సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ ఆంక్షల కారణంగా విదేశాల్లో స్తంభింపజేసిన వెనెజులాకు చెందిన సుమారు 30 టన్నుల బంగారాన్ని విడుదల చేయాలని కింగ్ చార్లెస్–3ను కోరినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు.

వాట్సాప్ ఫార్వర్డ్, స్క్రీన్‌షాట్ టికెట్లకు ఇక చెల్లదు

రైల్వే శాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: రైలు ప్రయాణాల్లో టికెట్ల తనిఖీ విధానంపై భారతీయ రైల్వే శాఖ కీలక నిర్ణయం ప్రకటించింది. ఇకపై వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేసిన టికెట్లు లేదా స్క్రీన్‌షాట్‌ల రూపంలో చూపించే టికెట్లను చెల్లుబాటు అయ్యేవిగా పరిగణించబోమని స్పష్టం చేసింది. టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టడం, నకిలీ లేదా మార్పులు చేసిన టికెట్ల వినియోగాన్ని నిరోధించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసు కున్నట్లు వెల్లడించింది. వాట్సాప్ ఫార్వర్డ్‌లు, స్క్రీన్‌షాట్ టికెట్లను సులభంగా ఎడిట్ చేయడం లేదా ఇతరులకు పంపించే అవకాశం ఉండటంతో వాటి ద్వారా మోసాలకు ఆస్కారం ఏర్పడుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఓటీటీ సినిమాలకూ సెన్సార్ తప్పనిసరి?

- **చట్ట సవరణలపై కేంద్రం కసరత్తు**
- **థియేటర్ చిత్రాల మాదిరిగానే ఓటీటీ విడుదలకూ సర్టిఫికేషన్ యోచన**
- **'సత్లుజ్' వివాదం తర్వాత వేగం పుంజుకున్న ప్రతిపాదన**

న్యూఢిల్లీ: ఓటీటీ వేదికలపై విడుదలయ్యే సినిమాలకూ సెన్సార్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం థియేటర్లలో విడుదలయ్యే చిత్రాలకు మాత్రమే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) నుంచి సెన్సార్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండగా, ఓటీటీ వేదికల్లో విడుదలయ్యే చిత్రాలు 2021 సమాచార సాంకేతిక (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనల ప్రకారం విడుదలవుతున్నా యి. ఈ నేపథ్యంలో సెన్సార్ బోర్డు థియేటర్ విడు దల కోసం అభ్యంతరం వ్యక్తం చేసిన కొన్ని సన్నివే శాలు లేదా తొలగించాలని సూచించిన భాగాలను యథాతథంగా ఉంచి నేరుగా ఓటీటీలో విడుదల చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల నటుడు దిల్జిత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ కల్రా జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'సత్లుజ్' చిత్రం ఈ అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు పలు కత్తిరింపులు సూచించినప్పటికీ, అనంతరం జూలై 3న జీ5 ఓటీటీ వేదికలో విడుదల చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఓటీటీ వేదికల్లో విడుదలయ్యే సినిమాలకు కూడా థియేటర్ చిత్రాల మాదిరిగానే సెన్సార్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసే నిబంధనలను తీసుకురావాలనే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

వింబుల్డన్ రాణిగా నోస్కోవా

- ఆల్-చెక్ ఫైనల్లో ముచోవాపై మూడు సెట్ల పోరులో విజయం
- కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కైవసం
- తల్లిని తలుచుకుని భావోద్వేగం
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి ఎగబాకనున్న చెక్ స్టార్

లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో చెక్ టెన్నిస్ ఆధిపత్యం మరోసారి కొనసాగింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 21 ఏళ్ల లిండా నోస్కోవా తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఘనంగా కైవసం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో సహచర చెక్ క్రీడాకారిణి కరోలినా ముచోవాపై 6-2, 5-7, 6-3తో విజయం సాధించి ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ కిరీటాన్ని సొంతం చేసుకుంది. తొలి సెట్‌ను ఏకపక్షంగా గెలిచిన నోస్కోవా, రెండో సెట్‌లో 5-2 ఆధిక్యంలో ఉండి ఐదు మ్యాచ్ పాయింట్లను చేజార్చుకుంది. వరుసగా ఐదు గేమ్‌లు గెలిచిన ముచోవా రెండో సెట్‌ను 7-5తో దక్కించుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. అయితే చివరి సెట్‌లో మళ్లీ పుంజుకున్న నోస్కోవా ఆరో మ్యాచ్ పాయింట్‌ను విజయవంతంగా మలచుకుని చాంపియన్‌గా నిలిచింది. విజయం ఖరారైన వెంటనే ఆనందంతో కోర్టులోనే గడ్డిమీద పడుకుని భావోద్వేగానికి గురైంది.

జైత్రయాత్ర కొనసాగింపు

గత నాలుగేళ్లలో వింబుల్డన్ గెలిచిన మూడో చెక్ మహిళగా నోస్కోవా చరిత్ర సృష్టించింది. 2023లో మార్కెటా వొండ్రౌసోవా, 2024లో బార్బోరా క్రెజ్‌చికోవా విజేతలుగా నిలవగా, ఇప్పుడు నోస్కోవా ఆ జాబితాలో చేరింది. 2011లో 21 ఏళ్ల వయసులో వింబుల్డన్ గెలిచిన పెట్రా క్విటోవా తర్వాత అదే వయసులో ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచింది. ఇదిలాఉంటే నోస్కోవా మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ తల్లిని తలుచుకొని కన్నీటి పర్యంతమైంది. రెండేళ్ల క్రితం మరణించిన తన తల్లి ఆశీస్సులు లేకపోతే ఈ స్థాయికి చేరుకునేదాన్ని కాదని చెబుతూ ఆకాశం వైపు చూసి ముద్దు పంపింది. ఈ దృశ్యాన్ని వీక్షించిన చెక్ టెన్నిస్ దిగ్గజం మార్టినా నవ్రతిలోవా కూడా భావోద్వేగానికి గురయ్యారు.

ముచోవాకు మరోసారి నిరాశ

కరోలినా ముచోవా (29)కు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్. 2023 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఇగా స్వియాటెక్ చేతిలో ఓడిన ఆమె, ఇప్పుడు వింబుల్డన్‌లోనూ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. విజేత నోస్కోవాను అభినందిస్తూ నువ్వు ఈ విజయానికి పూర్తిగా అర్హురాలివి అని ప్రశంసించింది. <

బెర్లిన్ ఓపెన్ టైటిల్ తర్వాత ఈ సీజన్‌లో గడ్డి కోర్టుపై నోస్కోవాకు ఇది రెండో ట్రోఫీ. తాజా డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ఆమె ఏడో స్థానానికి చేరుకోనుండగా, ఇది ఆమె కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌గా నిలవనుంది. 2026 సీజన్‌లో మహిళల టెన్నిస్‌లో మరో కొత్త తారగా నోస్కోవా తన ముద్ర వేసింది.

AXAR
20
RASHID
95
JACKS
85

భారత్‌కు ఘోర పరాభవం

- బట్లర్ విధ్వంసం, బ్రూక్ మెరుపు ఇన్నింగ్స్
- ఐదో టీ20లో 56 పరుగుల తేడాతో టీమిండియాపై ఇంగ్లండ్ విజయం
- 4-0తో సిరీస్ క్లీన్‌స్వీప్
- టీ20లో అగ్రస్థానం కోల్పోయిన భారత్

సౌతాంప్టన్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో, చివరి టీ20లో భారత్ మరోసారి తేలిపోయింది. మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ (131), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (95 నాటౌట్) ధాటికి భారత బౌలర్లు పూర్తిగా చేతులెత్తేయడంతో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-0తో కైవసం చేసుకున్న ఆతిథ్య జట్టు చారిత్రక క్లీన్‌స్వీప్‌ను పూర్తి చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలో ఫిల్ సాల్ట్ వికెట్‌తో శుభారంభం లభించినా, ఆ తర్వాత బట్లర్, బ్రూక్‌ల జోరుకు అడ్డుకట్ట వేయలేకపోయింది. ఇద్దరూ రెండో వికెట్‌కు 233 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యంగా కొత్త రికార్డు సృష్టించారు. 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో బట్లర్ 131 పరుగులు చేసి కెరీర్‌లో రెండో టీ20 శతకాన్ని నమోదు చేశాడు. మరోవైపు బ్రూక్ 45 బంతుల్లో 95 పరుగులతో చివరివరకు అజేయంగా నిలిచి భారత బౌలర్లను చిత్తు చేశాడు. నిర్ణీత 20 ఓవర్లలో ఇంగ్లండ్ 3 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఇక 258 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. ఇషాన్ కిషన్ 35 బంతుల్లో 56, తిలక్ వర్మ 25 బంతుల్లో 53 పరుగులతో అర్ధశతకాలు సాధించినా, అవసరమైన రన్‌రేట్‌ను అందుకోలేకపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకే పరిమితమైంది.

బౌలర్ల పేలవ ప్రదర్శన

భారత బౌలింగ్ విభాగం ఈ మ్యాచ్‌లో తీవ్రంగా నిరాశపరిచింది. అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్లలో 63 పరుగులు సమర్పించుకోగా, ప్రిన్స్ యాదవ్ 60 పరుగులు ఇచ్చాడు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సూర్యాంశ్ షెడ్గే కూడా మూడు ఓవర్లలో 39 పరుగులు సమర్పించుకున్నాడు. బట్లర్, బ్రూక్ కలిసి మొత్తం 16 సిక్సర్లు బాదగా, భారత జట్టు మొత్తం ఎనిమిది సిక్సర్లకే పరిమితమైంది. ఈ ఓటమితో భారత్ ఐసీసీ టీ20 జట్ల ర్యాంకింగ్స్‌లో దాదాపు నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న అగ్రస్థానాన్ని కోల్పోయింది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత్‌కు ఇది ఆరో పరాజయం కావడం గమనార్హం. సిరీస్‌లో భారత జట్టు అన్ని విభాగాల్లోనూ విఫలమవడంతో జట్టు ప్రదర్శనపై సమీక్ష చేపట్టాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం.

క్రాంతి పాంచ్‌పటాకా

- తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లండ్
- రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీతో ఆకట్టుకున్న స్మృతి మంధాన
- 269 పరుగుల ఆధిక్యంలో భారత్
- ఏకైక టెస్టులో విజయానికి చేరువ

లండన్: క్రాంతి గౌడ్ అద్భుత బౌలింగ్, స్మృతి మంధాన మరోసారి నిలకడైన బ్యాటింగ్‌తో ఇంగ్లండ్‌పై భారత మహిళల జట్టు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఏకైక టెస్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 154 పరుగులు చేసి మొత్తం 269 పరుగుల ఆధిక్యంలో నిలిచి విజయానికి బలమైన పునాది వేసుకుంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 170 పరుగులకే కుప్పకూల్చడంలో పేసర్ క్రాంతి గౌడ్ కీలక పాత్ర పోషించింది. రెడ్‌బాల్ క్రికెట్‌లో కెరీర్‌లోనే తొలి ఐదు వికెట్ల ఘనతను నమోదు చేసిన ఆమె 37 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుదేలు చేసింది. తొలి రోజు టామీ బీమాంట్‌ను ఔట్ చేసిన గౌడ్, రెండో రోజు మాయా బౌషియర్, అలీస్ క్యాప్సీ, లారెన్ బెల్‌తో పాటు మరో రెండు కీలక వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. సయాలి సాత్‌ఘరే, స్నేహ్ రాణా చెరో రెండు వికెట్లు సాధించి గౌడ్‌కు చక్కటి సహకారం అందించారు. కెప్టెన్ నాట్ స్కివర్-బ్రంట్ (44), ఏమీ జోన్స్ (52) ఐదో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యంతో ప్రతిఘటించినా, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 115 పరుగుల వెనుకబడింది.

మరోసారి మంధానే అండ

115 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఓపెనర్ స్మృతి మంధాన మరోసారి ప్రధాన బలంగా నిలిచింది. 124 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచిన ఆమె వరుసగా రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధశతకం నమోదు చేసింది. మొదట షెఫాలి వర్మ (33)తో కలిసి తొలి వికెట్‌కు 88 పరుగులు జోడించిన మంధాన, అనంతరం యాస్తిక భాటియా (39 నాటౌట్)తో రెండో వికెట్‌కు అజేయంగా 66 పరుగులు జోడించి భారత్‌ను పటిష్ఠ స్థితికి చేర్చింది. కవర్ డ్రైవ్‌లతో అలరించిన మంధాన స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్‌పై సిక్సర్‌తో తన ఇన్నింగ్స్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టానికి 154 పరుగులు చేసి మొత్తం 269 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. చేతిలో తొమ్మిది వికెట్లు ఉండటంతో మూడో రోజు వేగంగా పరుగులు చేసి ఇంగ్లండ్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఏకైక టెస్టులో భారత్ విజయానికి మరింత చేరువైంది.

> భారత మాజీ కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, అంజుమ్ చోప్రాకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అత్యున్నత గౌరవం లభించింది. క్రికెట్‌కు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ఇద్దరినీ ప్రతిష్ఠాత్మక ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చినట్లు ఐసీసీ శనివారం ప్రకటించింది. వీరితో పాటు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌కూ ఈ అరుదైన గౌరవం దక్కింది. స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరోలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ముగ్గురిని అధికారికంగా హాల్ ఆఫ్ ఫేమ్‌లోకి ఆహ్వానించారు. మ్యాచ్ ఫిక్సింగ్ వివాదాల తర్వాత భారత క్రికెట్‌కు కొత్త దిశానిర్దేశం చేసి, జట్టును ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణిగా తీర్చిదిద్దిన నాయకుడిగా గుర్తింపు పొందిన సౌరవ్ గంగూలీకి ఈ గౌరవం లభించింది. మహిళల క్రికెట్ సేవలకు గుర్తింపుగా మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రాకు కూడా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌ను కూడా ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చింది. తన దూకుడు బ్యాటింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరించిన పీటర్సన్, ఇంగ్లండ్ తరఫున ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో కీలక పాత్ర పోషించారు.

Business
బిజినెస్

> రిటైల్ దిగ్గజం డీమార్ట్ (అవెన్యూ సూపర్‌మార్ట్స్) 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో సంస్థ సమీకృత నికర లాభం 11.33 శాతం పెరిగి రూ.860.44 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.772.81 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 14.9 శాతం పెరిగి రూ.18,794.53 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.16,359.70 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యయాలు 15.11 శాతం పెరిగి రూ.17,637.17 కోట్లకు చేరగా, మొత్తం ఆదాయం రూ.18,820.31 కోట్లుగా నమోదైంది.

అల్యూమినా రిఫైనరీ విస్తరణ

- ఒడిశాలో ఆదిత్య బిర్లా రూ.12 వేల కోట్ల భారీ పెట్టుబడి .. మొత్తం రూ.20వేల కోట్లకు పెంపు
- సామర్థ్యాన్ని ఏడాదికి 1 మిలియన్ టన్నుల నుంచి 3 మిలియన్ టన్నులకు పెంచనున్న హిండాల్కో

భువనేశ్వర్: ఒడిశాలో పెట్టుబడులను మరింత విస్తరించేందుకు ఆదిత్య బిర్లా గ్రూప్ ముందుకొచ్చింది. రాయగడ జిల్లాలోని కంసారిగూడలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినా రిఫైనరీ విస్తరణ కోసం అదనంగా రూ.12 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా ప్రకటించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతో సమావేశమైన సందర్భంగా ఈ ప్రతిపాదనను వెల్లడించారు. హిండాల్కో ఇండస్ట్రీస్ ద్వారా ఇప్పటికే రూ.8 వేల కోట్ల వ్యయంతో ఏడాదికి 1 మిలియన్ టన్నుల సామర్థ్యం గల అల్యూమినా రిఫైనరీని సంస్థ నిర్మిస్తోంది. తాజా విస్తరణతో సామర్థ్యాన్ని 3 మిలియన్ టన్నులకు పెంచనుండగా, మొత్తం పెట్టుబడి రూ.20 వేల కోట్లకు చేరనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్థానిక పరిశ్రమలు, సేవా రంగం, అనుబంధ యూనిట్ల అభివృద్ధికి దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వం పూర్తి సహకారం

ఈ ప్రతిపాదనను స్వాగతించిన సీఎం మోహన్ చరణ్ మాఝీ, అల్యూమినా-అల్యూమినియం ఉత్పత్తుల్లోనే కాకుండా విలువ ఆధారిత తయారీ రంగంలోనూ ఒడిశాను దేశంలో అగ్రగామిగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రాజెక్టు అమలుకు భూమి, మౌలిక సదుపాయాలు, అనుమతులు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో అల్యూమినియంతో పాటు రసాయనాలు, సిమెంట్, పునరుత్పాదక ఇంధనం, వస్త్రాలు, కాపర్ రిఫైనింగ్, పెయింట్స్, ఆభరణాల తయారీ తదితర రంగాల్లో భవిష్యత్ పెట్టుబడులపైనా చర్చించారు.

అతనుకు రూ.1.07 కోట్ల పారితోషికం

- 2025-26లో 3.5 శాతం పెరుగుదల
- మధ్యలోనే రాజీనామా చేసిన అతను చక్రవర్తి
- రాజీనామాతో గవర్నెన్స్‌పై ప్రశ్నలు
- ఆరోపణలకు ఆధారాలు లేవని తేల్చిన బ్యాంకు

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాజీ పార్ట్‌టైమ్ చైర్మన్ అతను చక్రవర్తి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.07 కోట్ల పారితోషికం అందుకున్నారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 3.53 శాతం అధికమని బ్యాంకు వార్షిక నివేదిక వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆయనకు రూ.1.03 కోట్లు లభించాయి. చక్రవర్తికి వార్షికంగా రూ.50 లక్షల స్థిర పారితోషికాన్ని ఆర్‌బీఐ ఆమోదించగా, మార్చి 18, 2026న పదవికి రాజీనామా చేయడంతో ఆయన పనిచేసిన కాలానికి అనుగుణంగా ఆ మొత్తాన్ని చెల్లించారు. అదనంగా బోర్డు, కమిటీ సమావేశాలకు హాజరైనందుకు సిట్టింగ్ ఫీజు, కారు సౌకర్యం కల్పించారు. పదవిలో ఉన్నంతకాలం జరిగిన 17 బోర్డు సమావేశాలకు ఆయన హాజరయ్యారు. నైతిక విలువలు, గవర్నెన్స్‌పై ఆందోళనలు వ్యక్తం చేస్తూ చక్రవర్తి పదవీకాలం పూర్తికాకముందే రాజీనామా చేయడం బ్యాంకులో చర్చనీయాంశమైంది. దీనిపై బ్యాంకు దేశీయ, అంతర్జాతీయ న్యాయ సంస్థలతో స్వతంత్ర సమీక్ష నిర్వహించగా, రాజీనామా లేఖలో చేసిన ఆరోపణలకు రికార్డులు, సాక్ష్యాల ఆధారంగా బలం లేదని ఆ సంస్థలు తేల్చినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వెల్లడించింది.

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ షోకాజ్ నోటీసులు

- పాడైన, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల సరఫరాపై వినియోగదారుల ఫిర్యాదులు
- మొత్తం 9 నోటీసులు జారీ.. వివరణతో పాటు అనుసరణ నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: త్వరిత డెలివరీ సేవల సంస్థ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్కు భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పాడైన, గడువు ముగిసిన, కలుషితమైన ఆహార ఉత్పత్తులు సరఫరా చేశారంటూ వినియోగదారుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా మొత్తం తొమ్మిది నోటీసులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. శిశువుల ఆహార ఉత్పత్తి పాడైన స్థితిలో ఉండడం, సరైన నిల్వ లేకపోవడం, తిరిగి ఇచ్చిన అదే ఉత్పత్తిని మళ్లీ పంపించారనే ఆరోపణలు నమోదయ్యాయి. అలాగే కలుషితమైన గుడ్లు, పాలు, దెబ్బతిన్న ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులు సరఫరా చేసినట్లు ఫిర్యాదులు వచ్చినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. కొన్ని విక్రేతలు తప్పు, చెల్లని లేదా అసలు లేని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొంది. నమోదైన పేర్లకు భిన్నంగా వ్యాపార సంస్థలను జాబితాలో చేర్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయని వెల్లడించింది. నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

Meta
Muse Image

విమర్శలతో వెనక్కి తగ్గిన మెటా

- మ్యూస్ ఏఐలో వివాదాస్పద ఫీచర్‌కు గుడ్‌బై
- గోప్యత ఆందోళనలతో నిర్ణయం
- ఇన్‌స్టాగ్రామ్ పబ్లిక్ ఖాతాల ఆధారంగా చిత్రాల సృష్టి ఫీచర్ తొలగింపు

న్యూఢిల్లీ: డేటా గోప్యతపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో సోషల్ మీడియా దిగ్గజం మెటా తన కొత్త మ్యూస్ ఏఐ ఇమేజ్ జనరేటర్‌లో ప్రవేశపెట్టిన వివాదాస్పద ఫీచర్‌ను ఉపసంహరించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని పబ్లిక్ ఖాతాలను ఆధారంగా చేసుకుని ఏఐ చిత్రాలను రూపొందించే ఈ ఫీచర్‌పై వినియోగదారులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సంస్థ వెనక్కి తగ్గింది. ఈ వారం ప్రారంభంలో మెటా, పబ్లిక్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను @మెన్షన్ చేసి వాటి ఆధారంగా ఏఐ చిత్రాలు రూపొందించే సదుపాయాన్ని ప్రకటించింది. అయితే ఇది వ్యక్తిగత డేటా గోప్యత, చిత్రాల అనుమతి లేకుండా వినియోగం (ఇమేజ్ స్క్రాపింగ్), సమ్మతి వంటి అంశాలపై తీవ్ర ఆందోళనలకు దారితీసింది. ఈ నేపథ్యంలో స్పందించిన మెటా, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆ ఫీచర్‌ను తొలగించినట్లు వెల్లడించింది. 'ఈ ఫీచర్ ఆశించిన స్థాయిలో లేదని వచ్చిన స్పందనను మేము విన్నాం. అందుకే దీన్ని ఇక అందుబాటులో ఉంచడం లేదు' అని సంస్థ తెలిపింది.

ప్రభుత్వం అప్రమత్తం

మెటా తాజాగా ప్రకటించిన మ్యూస్ ఏఐను సంస్థ ఇప్పటివరకు రూపొందించిన అత్యంత శక్తివంతమైన ఏఐ ఇమేజ్ జనరేషన్ మోడల్‌గా పేర్కొంది. అయితే ఈ ఫీచర్‌పై వివాదం చెలరేగడంతో భారత ప్రభుత్వం కూడా దీనిని ప్రస్తుత చట్టాల ప్రకారం పరిశీలించనున్నట్లు ప్రకటించింది. ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ మాట్లాడుతూ, ఈ అంశంపై అందే ఫిర్యాదులు, వినతులను పరిశీలించి అవసరమైన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీంతో ఏఐ ఆధారిత సేవల్లో వినియోగదారుల గోప్యత, డేటా భద్రతపై చర్చ మరింత ముమ్మరమైంది.

> దుబాయ్ నుంచి లక్నోకు వచ్చిన ఫ్లైదుబాయ్ విమానానికి బర్డ్ హిట్ అయినట్లు ల్యాండింగ్ అనంతరం నిర్వహించిన సాంకేతిక తనిఖీల్లో గుర్తించారు. అయితే ఈ ఘటన వల్ల విమాన ప్రయాణానికి గానీ, ప్రయాణికుల భద్రతకు గానీ ఎలాంటి ప్రమాదం జరగలేదని విమానాశ్రయ అధికారులు స్పష్టం చేశారు. శనివారం ఉదయం 7.11 గంటలకు ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్443 విమానం 164 మంది ప్రయాణికులతో లక్నో విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. అనంతరం నిర్వహించిన సాధారణ సాంకేతిక తనిఖీల్లో విమానంపై బర్డ్ హిట్‌కు సంబంధించిన ఆనవాళ్లు గుర్తించారు. విమానంలోని 164 మంది ప్రయాణికులంతా సురక్షితంగా దిగారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం విమానానికి అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మౌనమైన మధుర స్వరం

గానకోకిల ఎస్ జానకి ఇకలేరు

భారతీయ సినీ సంగీత ప్రపంచాన్ని తన అపూర్వ గానమాధుర్యంతో ఆరు దశాబ్దాలకుపైగా అలరించిన దక్షిణ భారత గానకోకిల, దిగ్గజ నేపథ్య గాయని ఎస్. జానకి (88) శనివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె కర్ణాటకలోని మైసూరులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఈ ఏడాది జనవరిలో ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ మరణించడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన జానకమ్మ, కొద్ది నెలల వ్యవధిలోనే కన్నుమూయడంతో భారతీయ సినీ సంగీత రంగంలో ఒక స్వర్ణయుగానికి తెరపడింది. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జన్మించిన జానకి చిన్నతనం నుంచే సంగీతంపై అపారమైన ఆసక్తి కనబరిచారు. నాదస్వరం విద్వాంసుడు పైడిస్వామి వద్ద సంగీతంలో ప్రాథమిక శిక్షణ పొందిన ఆమె ప్రతిభను గుర్తించిన మేనమామ చెన్నైకి తీసుకెళ్లడంతో ఆమె సంగీత జీవితం కొత్త మలుపు తిరిగింది. 1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలైయాట్టు' ద్వారా సినీ గాయనిగా అరంగేట్రం చేసిన ఆమె, అదే ఏడాది 'ఎమ్మెల్యే' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు.

48 వేల పాటలతో
గాన ప్రపంచంలో చెరగని ముద్ర

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 20కి పైగా భారతీయ, విదేశీ భాషల్లో 48 వేలకుపైగా పాటలు ఆలపించి ఎస్. జానకి అరుదైన రికార్డు సృష్టించారు. మెలోడీలు, జానపద గీతాలు, భక్తి గీతాలు, ప్రేమగీతాలు, మాస్ పాటలు, శాస్త్రీయ సంగీతం.. ఇలా ఏ సంగీత ప్రక్రియలోనైనా ఆమె తనదైన ముద్ర వేశారు. పాటలో భావోద్వేగాన్ని పలికించడంలో, వెండితెరపై నటీనటుల హావభావాలకు అనుగుణంగా స్వరాన్ని మార్చడంలో ఆమెకు ఆమే సాటి. చిన్నారుల గొంతును కూడా సహజంగా అనుకరిస్తూ పాడిన పాటలు సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అందుకే ఆమెను సినీ పరిశ్రమ ప్రేమగా 'క్వీన్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్'గా అభివర్ణించింది.

2017లో గాన ప్రస్థానానికి వీడ్కోలు

ఆరు దశాబ్దాల పాటు కోట్లాది సంగీతాభిమానులను తన మధుర గానంతో మంత్రముగ్ధులను చేసిన ఎస్. జానకి, 2017 అక్టోబర్ 28న మైసూరులో నిర్వహించిన బహిరంగ సంగీత కచేరీతో తన గాన జీవితానికి అధికారికంగా వీడ్కోలు పలికారు. భౌతికంగా ఆమె ఇక మన మధ్య లేకపోయినా, ఆమె ఆలపించిన వేలాది అమరగీతాల రూపంలో జానకమ్మ స్వరం తరతరాల పాటు సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా మార్మోగుతూనే ఉంటుంది.



ఇళయరాజా – ఎస్పీబీతో సంగీత యానం

ఎస్. జానకి సినీ ప్రయాణంలో సంగీత దర్శకుడు ఇళయరాజాతో చేసిన అద్భుత సంగీత ప్రయోగాలు ప్రత్యేక అధ్యాయంగా నిలిచాయి. అలాగే గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె ఆలపించిన వేలాది యుగళగీతాలు భారతీయ సినీ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఎం.ఎస్. విశ్వనాథన్ నుంచి ఏ.ఆర్. రెహమాన్ వరకు దాదాపు ప్రతి ప్రముఖ సంగీత దర్శకుడి స్వరాల్లో ఆమె ఎన్నో చిరస్మరణీయ గీతాలను అందించారు. నాలుగు జాతీయ పురస్కారాలతో అపూర్వ గౌరవం ఆమె అసాధారణ గాన ప్రతిభకు గుర్తింపుగా నాలుగు జాతీయ చలనచిత్ర పురస్కారాలు లభించాయి. 1977లో '16 వయదినిలే' చిత్రంలోని 'సెంధూర పూవే' పాటకు తొలి జాతీయ అవార్డు అందుకున్న ఆమె, 1981లో మలయాళ చిత్రం 'ఒప్పోల్'లోని 'ఎట్టుమానూర్ అంబలత్తిల్' గీతంతో రెండోసారి జాతీయ అవార్డు అందుకున్నారు. అనంతరం 1984లో తెలుగు క్లాసిక్ 'సితార' చిత్రంలోని 'వెన్నెల్లో గోదారి అందం' పాటకు మూడో జాతీయ పురస్కారం, 1992లో కమల్‌హాసన్ నటించిన 'దేవర్ మగన్' (తెలుగులో 'క్షత్రియ పుత్రుడు') చిత్రంలోని 'ఇంజి ఇడుప్పళగా' పాటకు నాలుగో జాతీయ అవార్డు సొంతం చేసుకున్నారు.

పద్మభూషణ్‌ను సున్నితంగా
తిరస్కరించిన గాన దిగ్గజం

జాతీయ అవార్డులతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 33 రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న జానకికి మైసూరు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని దక్షిణాది కళాకారులకు తగిన గుర్తింపు లభించడం లేదనే అభిప్రాయంతో సున్నితంగా తిరస్కరించి తన ఆత్మగౌరవాన్ని చాటుకున్నారు.

ప్రతి రోజూ కొత్త అనుభవం

ఉస్తాద్ భగత్ సింగ్‌తో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చిన రాశీ ఖన్నా ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ బిజీగా ఉంది. అక్షయ్ కుమార్ హీరోగా, అనీస్ బాజ్మీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న, ఇంకా పేరు ఖరారు కాని చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. విద్యా బాలన్ కూడా ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.తాజాగా ఈ సినిమా తన భాగం షూటింగ్ పూర్తయినట్లు రాశీ ఖన్నా సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ప్రతి షెడ్యూల్ మనకు ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుంది. షూటింగ్ మధ్యలో అనారోగ్యం బారిన పడటం కష్టమైన అనుభవం.

కొన్ని సందర్భాల్లో శారీరకంగా ఎంతో శ్రమించాల్సి వచ్చింది. కానీ కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్, యూనిట్ సభ్యుల ఆప్యాయత నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తవడం గురించి ఆలోచించినప్పుడు అలసట కంటే కృతజ్ఞత భావమే ఎక్కువగా గుర్తుకొస్తుంది. ఇవన్నీ నా సినీ ప్రయాణంలో చిరస్మరణీయ జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి అని రాశీ ఖన్నా తన పోస్ట్‌లో పేర్కొంది.

భావోద్వేగాల 'హృదయం మురళి'

అథర్వ, ప్రీతి ముకుందన్, కయదు లోహర్ ప్రధాన పాత్రల్లో ఆకాష్ బాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఫీల్‌గుడ్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా 'హృదయం మురళి' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రేమను వ్యక్తపరచలేని ఓ యువకుడి జీవితాన్ని భావోద్వేగాలతో ముడిపెట్టి చెప్పిన ఈ చిత్రం హృదయానికి హత్తుకునే అంశాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. కథ విషయానికి వస్తే.. హృదయ్ (అథర్వ) చిన్నప్పటి నుంచే ఎంతో సిగ్గరి. తన మనసులో ఉన్న ప్రేమను ఎవరికీ చెప్పలేక తాను ప్రేమించిన ప్రతి అమ్మాయిని కోల్పోతూ ఉంటాడు. టీనేజ్‌లో సమంత (ప్రీతి ముకుందన్)పై గాఢమైన ప్రేమ పెంచుకున్నా ఆ విషయాన్ని ఆమెకు చెప్పలేకపోతాడు. అనంతరం అతని జీవితంలోకి ఆమూద (కయదు లోహర్) వస్తుంది. ఆమెపై కూడా ప్రేమ పెంచుకున్నప్పటికీ తన భావాలను వ్యక్తం చేయలేడు. ఇలా తన జీవితంలోకి వచ్చిన ప్రతి అమ్మాయి ఒక అందమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలు, గత జ్ఞాపకాలు, భావోద్వేగాల మధ్య హృదయ్ తన జీవితాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాడు? ప్రేమను వ్యక్తపరచలేకపోవడానికి అసలు కారణం ఏమిటి? చివరకు అతని జీవితంలోకి ఎవరు వచ్చారు? సమంతతో అతని బంధం మళ్లీ ఎలా కలిసింది? అన్నదే మిగతా కథ.నటీనటుల విషయానికి వస్తే.. అథర్వ ఈ చిత్రానికి ప్రధాన బలం. కామెడీ టైమింగ్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాల్లోనూ తన ప్రతిభను చాటాడు. పాత్రలోని వయసు, పరిస్థితులకు అనుగుణంగా చూపించిన హావభావాలు, బాడీ లాంగ్వేజ్ సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. ప్రీతి ముకుందన్‌తో ప్రేమకథలోనూ అథర్వ నటన సహజంగా అనిపిస్తుంది. మరో హీరోయిన్ కయదు లోహర్ తన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. కీలక పాత్రలో నట్టి మెప్పించగా, ఫహద్ ఫాజిల్ తన ప్రత్యేక నటనతో సినిమాకు అదనపు బలం చేకూర్చాడు. ఫ్రెండ్ పాత్రలో కనిపించిన థమన్ ఎస్ కూడా సహజంగా నటించాడు. నిహారిక, రక్షణ, ద్రవిడ్ సెల్వం, ఏంజెలిన్, అంజు కురియన్, సుధాకర్, యశశ్రీ, జోనితా గాంధీ తదితరులు తమ పాత్రల పరిధిలో మెప్పించారు. దర్శకుడు ఆకాష్ బాస్కరన్ ఎంచుకున్న కథాంశం, ప్రేమతో పాటు భావోద్వేగాలను మిళితం చేసిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సిగ్గరి యువకుడు ప్రేమలో పడినప్పుడు అతనికి, అతని ప్రేయసికి మధ్య ఏర్పడే అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించారు. థమన్ ఎస్ అందించిన నేపథ్య సంగీతం ఆ సన్నివేశాలకు మరింత బలం చేకూర్చింది. అయితే కథలోని భావోద్వేగాలను బలంగా రాసుకున్న దర్శకుడు అదే స్థాయిలో స్క్రీన్ ప్లేను రూపొందించడంలో కొంత వెనుకబడ్డారు. ముఖ్యంగా ద్వితీయార్థంలో కథనం కొన్నిచోట్ల నెమ్మదిగా సాగుతుంది. హీరో, ప్రధాన కథానాయిక మధ్య ప్రేమకథను మరింత బలంగా చూపించి ఉంటే సినిమా ఇంకా ప్రభావవంతంగా ఉండేది. అథర్వ నటన, ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగ ఘట్టాలు, క్లైమాక్స్, థమన్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలుస్తాయి. ఫీల్‌గుడ్ ప్రేమకథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ చిత్రం ఒకసారి చూసేలా ఆకట్టుకుంటుంది.

నా హద్దులు దాటను

సీనియర్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన వ్యక్తిగత పరిమితులపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ప్రధాన పాత్రలో నటించిన 'ది ఇండియా స్టోరీ' సినిమా జులై 24న విడుదల కానుండగా, ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించారు. బికినీ సన్నివేశాల్లో నటించడం నాకు సౌకర్యంగా అనిపించదు. అలాగే ఇంటిమేట్ సీన్స్ చేయడంలోనూ నేను కంఫర్ట్‌గా ఉండను. ఈ విషయంలో నాకు కొన్ని వ్యక్తిగత పరిమితులు ఉన్నాయి. ఆ హద్దును దాటాల్సి వస్తే, సినిమా ఎంత పెద్దదైనా, పాత్ర ఎంత ముఖ్యమైనదైనా ఆ ప్రాజెక్ట్‌ను మర్యాదపూర్వకంగా తిరస్కరిస్తాను అని కాజల్ చెప్పారు. ప్రతి ఒక్కరికీ జీవితంలో తమ సొంత సరిహద్దులు ఉంటాయి. వాటిని గౌరవించడం చాలా ముఖ్యం అని ఆమె పేర్కొన్నారు. అయితే కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆమె నటించిన కొన్ని చిత్రాల్లోని రొమాంటిక్ సన్నివేశాలు, లిప్‌లాక్ సీన్లు, అలాగే సోషల్ మీడియాలో పంచుకున్న కొన్ని ఫొటోలను ప్రస్తావిస్తూ కొందరు నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. మరోవైపు, వ్యక్తిగత పరిమితులు నిర్ణయించుకోవడం ప్రతి నటుడి హక్కేనని మరికొందరు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు.

రోషన్ కనకాల కొత్త మూవీ ప్రారంభం

టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల కథానాయకుడిగా ఓ వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె. కమిట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదం వంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఒక సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ కథను సిద్ధం చేశారు. ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక అత్యంత వైభవంగా జరిగిన ఈ ముహూర్తపు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. యువ హీరో నిఖిల్ సిద్దార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, టాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు, త్వరలోనే టైటిల్ మరియు పూర్తి నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. అన్ని హంగులు అద్దుకుని త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది.

24న 'రామాయణ' ట్రైలర్

భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు ముందే దేశవ్యాప్తంగా విశేష ఆసక్తిని రేకెత్తించిన ఈ చిత్రం ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో 'రామాయణ' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టులో, "వేలాది సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ వంటి విలువలకు ప్రతీకగా నిలిచిన 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ మహా ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకులకు సరికొత్త రూపంలో అందించబోతున్నాం" అని పేర్కొంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. రణబీర్ కపూర్, సాయి పల్లవితో పాటు పలువురు అగ్రతారలు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ట్రైలర్ విడుదలతో సినిమాపై మరింత ఆసక్తి పెరగనుంది.



Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277